
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శుక్రవారం 11 జూలై 2025





నరసాపురం వైఎస్ పాలెంలో తల్లులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

ఆత్మీయ సందడి

ఆట పాటలు.. ఆత్మీయ సమ్మేళనాలతో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

1,960 పాఠశాలలు, 121 కళాశాలల్లో విద్యార్థులు, తల్లులతో నిర్వహణ

భీమవరం రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): 'తల్లుల అభిప్రాయాలు తీసుకోవాలి.. టీచర్లు ప్రణాళిక చెప్పాలి' అనే ఆలోచనతో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఆత్మీయ సమ్మేళనం వైభవంగా జరిగింది. జిల్లాలోని 1,960 పాఠశాలలు, 121 జూనియర్ కళాశాలల ప్రాంగణాల్లోని విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడి నెలకొంది. పాఠశాలల్లోకి తల్లులను ఉపాధ్యాయులు ఆహ్వానించడం నుంచి కార్యక్రమం పూర్తయ్యే వరకు సమన్వయంతో సాగాయి. ప్రతి పాఠశాలలోను తల్లులందరూ మీటింగ్‌కు హాజరయ్యారు. వారి పిల్లల వివరాలను తెలపడంతో పాటు ఏ విధమైన మార్పు లు చేస్తే బాగుంటుందో సలహాలు ఇచ్చారు. ఉపాధ్యాయులు విద్యా బోధనలో ప్రణాళిక, క్రమశిక్షణపై వివరించారు. ఈ మీటింగ్ ద్వారా విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాట వేసేందుకు ఉపయోగకరంగా ఉంటుందని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమైన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో విద్యార్థుల చదువు చర్చతోపాటు తల్లులకు నిర్వహించిన క్రీడలు ఆకర్షణగా నిలిచాయి. మ్యూజికల్ చైర్స్, ముగ్గుల పోటీలు వంటి క్రీడల్లో తల్లులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారు వయసును మరిచి పిల్లల మాదిరి పోటీ పడ్డారు. ప్రతిభ కనబర్చిన తల్లులకు బహుమతులు అందించారు. చిన్నారులు గ్రూప్ డ్యాన్సులు చేశారు. పాటలు పాడారు. పూర్వపు విద్యార్థులు ఈ మీటింగ్‌కు హాజరైన వారు ఆయా పాఠశాలల్లో సాధించిన ప్రతిభను తెలపడంతోపాటు ఏ లక్ష్యంతో ముందుకు సాగాలన్నది సూచనలు ఇచ్చారు. 'తల్లికి వందనం' ద్వారా ప్రభుత్వం మంచి సహకారం అందిస్తోందని తల్లులు స్పష్టం చేశారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని పిల్లలతో కలిసి తల్లులు తిన్నారు.



లంకలకోడేరు హైస్కూల్‌లో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల, చిత్రంలో అంగర



భీమవరంలో తల్లుల ఆటలు, చిన్నారుల డ్యాన్సులు



• ఆనందంగా ఉంది



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన బాగుంది. మా అమ్మాయి పదో తరగతి చదువుతోంది. పిల్లలు ఎలా చదువుతున్నారో తెలుసుకునేందుకు తల్లికి, ఉపాధ్యాయులకు మధ్య సమన్వయానికి ఈ మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ ఎంతో ఉపయోగపడుతుంది. తల్లులకు క్రీడలు నిర్వహించడం ఆనందంగా ఉంది. మ్యూజికల్ చైర్‌లో విజేతగా నిలిచాను.

- సుధ, భీమవరం

• ఆ రోజులు గుర్తుకొచ్చాయి



తల్లులకు, ఉపాధ్యాయులకు మధ్య ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ వల్ల విద్యార్థుల్లోని లోపాలు తెలుసుకుని వారు బాగా చదివేలా చేయడానికి వీలవుతుంది. తల్లులకు క్రీడలు నిర్వహించడం ఆనందంగా ఉంది. ఆ రోజులు గుర్తుకొచ్చాయి.

- జయ, భీమవరం

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు : మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్/రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి):'నేడు విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకు రావడంతోపాటు ఉత్తమ విద్య అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వ లక్ష్యం పనిచేస్తోంది. గత ప్రభుత్వం మాదిరి తమ ప్రభుత్వానికి రంగులు, బొమ్మల పిచ్చి లేదు' అని రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పట్టణంలోని బీవీఆర్ఎం హైస్కూల్, లంకలకోడేరు జడ్పీ హైస్కూల్, ఉల్లంపర్రు ఆదిత్య జూనియర్ జూనియర్ కళాశాలల్లో గురువారం జరిగిన మెగా పేరెంట్ - టీచర్స్ సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులపై పిల్లల చదువుల భారం తగ్గించేందుకు 'తల్లికి వందనం' అందజేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం మాదిరి కాకుండా ఇంటిలో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికి ఒకొక్కరికి రూ.13 వేలు చొప్పున అందజేస్తున్నామన్నారు. విద్యార్థులు ఇళ్ల దగ్గర సెల్‌ఫోన్‌లతో కాలయాపన చేయకుండా సమయపాలనను పాటించి పోటీతత్వంతో విద్యలో రాణించాలన్నారు. విద్యార్థులు ప్రత్యేకంగా రూపొందించిన స్వాగత ద్వారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులతో కలిసి మంత్రి మధ్యాహ్న భోజనం చేశారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, పాలకొల్లు ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, పాలకొల్లు డీసీ చైర్మన్ పెన్మెత్స రామభద్రరాజు, ఎంఈవోలు జి.వీరాస్వామి, గంగాధరశర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు చుక్కాని పీటీఎమ్ : కలెక్టర్

పాలకోడేరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశాలు విద్యార్థుల భవిష్యత్‌కు చుక్కానిలా దోహదపడతాయని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. పాలకోడేరు మండలం వేంద్ర శ్రీ భూపతిరాజు సుబ్బతాతరాజు జడ్పీ హైస్కూల్‌లో గురువారం జరిగిన పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 'పిల్లలు ఏ విధంగా చదువుతున్నారు.. టీచర్లు ఎలా బోధిస్తున్నారనేది ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కలుగుతుంది. పిల్లలు స్కూల్ నుంచి వచ్చిన తర్వాత ఏ విధంగా ఉంటున్నారో వారి ప్రవర్తనను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి' అని కోరారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్‌కు బానిసై చదువుపై శ్రద్ధ చూపలేకపోతున్నారు. చదువు, ప్రవర్తన పట్ల తల్లిదండ్రులు అప్రమత్తతతో ఉండాలి. విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని కొందరు గంజాయి, డ్రగ్స్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారు. వీరిపట్ల జాగరూకతతో ఉండాలి' అని సూచించారు. అమ్మ పేరుతో మొక్కలు నాటేందుకు కలెక్టర్ విద్యార్థులకు పంపిణీ చేశారు. కలెక్టర్, ఎస్పీ విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. డీఈవో ఇ.నారాయణ, హెచ్ఎం శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్, జిల్లా మత్స్య శాఖ అధికారి నాగలింగాచార్యులు, విద్యాశాఖ ఏడీ ఎన్.సత్యనారాయణ, ఎంఇవోలు నాగరాజు, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



టగ్ ఆఫ్ వార్ ఆడుతున్న కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అస్మి



క్రెడిట్ ప్లాన్

అవసరం మేరకే రుణాలు

- రుణ భారాన్ని తగ్గించుకుంటున్న డ్వాక్రా మహిళలు
- జిల్లాలో 28 వేల గ్రూపులు.. 24,391 గ్రూపులకు సర్వే
- అంచనాలు సిద్ధం.. రూ.861 కోట్లు రుణ పరపతి

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

డ్వాక్రా సంఘాల వారీ మహిళలకు అవసరం వున్నా, లేకున్నా రుణాలు ఇవ్వడం ఇప్పటి వరకు ఆనవాయితీగా వచ్చింది. సంఘాన్ని ప్రామాణికంగా తీసుకుని అందరికీ సమానంగా రుణాలు ఇచ్చేవారు. ఏటా లక్ష్యాన్ని పెంచేశారు. వ్యాపారం, ఇతర ఉపాధి అవసరాల కోసం వినియోగించుకునే మహిళలు నెలవారీ వాయిదాలను సక్రమంగా చెల్లించినప్పటికి మిగిలిన వారు వాయిదాలు చెల్లించేందుకు ఇబ్బందులు పడేవారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం క్రెడిట్ ప్లాన్‌కు శ్రీకారం చుట్టింది. మహిళలకు అవసరమైన మేరకే రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. గ్రూపులో ఎవరికి ఎంత అవసరమో గుర్తించి ఆ మేరకు రుణాలు ఇస్తున్నారు. ఒక గ్రూపులో అందరి సభ్యులకు సమానంగా రుణాలు ఇవ్వాలన్న నిబంధనకు స్వస్తి పలికారు. ఇది మహిళలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది. వద్దనుకున్న వారికి రుణభారం తగ్గుతోంది. అవసరమైన వారికి అధికంగా రుణ పరపతి లభిస్తుంది.

జిల్లాలో రూ.1,100 కోట్లు అంచనా

జిల్లాలో 28 వేల డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 24,391 గ్రూపులకు సర్వే చేశారు. వారికి రూ.861 కోట్లు అవసరమని గుర్తించారు. గ్రూపుల వారీగా బ్యాంకులకు నివేదికలు ఇస్తున్నారు. 40 శాతం మంది మహిళలకు రుణాలు ఇచ్చేవారు. మరో 3,609 గ్రూపుల సర్వే పూర్తి చేయాలి. జిల్లాలోని 28 వేల గ్రూపుల మహిళలకు రూ.1,100 కోట్ల మేర రుణం అవసరమని అంచనా. గతంతో పోలిస్తే రూ.500 కోట్లు తగ్గింది.

ఎన్నికల ముందు ఇష్టారీతిన రుణాలు

గత అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి ప్రభుత్వం ఇష్టారాజ్యంగా రుణాలు ఇచ్చేయాలని సూచించింది. 'రుణమాఫీ' వుంటుందని మహిళలు అపోహపడ్డారు. ఆ ఏడాది రూ.3 వేల కోట్లు రుణాలు తీసుకున్నారు. ఆ సొమ్ములను చెల్లించేందుకు ఇప్పుడు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అంతకు ముందు ఏటా రూ.1600 కోట్ల మేర రుణాలు పొందేవారు. ఒక గ్రూపులో మహిళలందరికి సమానంగా రుణాలు ఇచ్చేవారు. నెలసరికి చెల్లించలేక కొందరు ఇబ్బంది పడేవారు. రికవరీ కోసం గ్రూపు అధ్యక్షురాలు ఒత్తిడి చేసేవారు. రుణం వద్దన్నా కుదిరేది కాదు. బలవంతాన అంటగట్టేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. క్రెడిట్ ప్లాన్‌లో ఎంత కావాలని అనుకుంటే అంత మొత్తాన్ని మంజూరుచేస్తారు. ఒకే గ్రూపులో హెచ్చు తగ్గులు వల్ల మహిళలు ఊపిరి పీల్చుకుంటున్నారు.

పరుపుల తయారీ పరిశ్రమ దగ్ధం.. కోట్లలో ఆస్తి నష్టం | 7 | గురుకుల కళాశాల విద్యార్థిని మృతి బంధువుల ఆందోళన



శాకంబరిగా మావుళ్లమ్మ

భీమవరం టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి):మావుళ్లమ్మ శాకంబరిగా దర్శనమిచ్చారు. గురుపౌర్ణమి సందర్భంగా గురువారం అమ్మ వారిని ఆరు టన్నుల కూరగాయలు, ఆకుకూరలు, వివిధ రకాల పండ్లతో అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ అమ్మ వారికి సంప్రోక్షణ చేసి, ప్రాతఃకాల పూజ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మావుళ్లమ్మతోపాటు అంతరాలయం, ముఖ మండపాలను చూడచక్కగా తీర్చిదిద్దారు. శాకంబరీ అలంకారంలో వున్న మావుళ్లమ్మను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించారు. పౌర్ణమి సందర్భంగా మావుళ్లమ్మ ఆలయం వద్ద చండీ హోమం నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్దా మహాలక్ష్మినగేష్ పర్యవేక్షించారు.

సాగునీటికి ఊపిరి

- జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేస్తూ కేబినెట్ ఆమోదం
- నల్లి క్రీక్‌కు రూ.17 కోట్లు.. స్లూయిస్‌లకు రూ.8.8 కోట్లు కేటాయింపు


నరసాపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి):గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నీటిపారుదల శాఖ తీరు అస్తవ్యస్తంగా ఉండేది. లాకులకు గ్రీజ్ పెట్టలేదు. డ్రైనేజీల్లో గంపెడు మట్టి తీయలేదు. గోదావరి వరదల వేళ.. పరీవాహక ప్రాంత ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సి వచ్చేది. ఏటిగట్ల పటిష్టత, స్లూయిస్‌ల లీకేజీలు, మరమ్మతులకు కనీసం ఒక్క రూపాయి విడుదల చేయలేదు. కూటమి అధికారంలోకి రాగానే వీటిపై శ్రద్ధ పెట్టింది. నియోజకవర్గాల వారీగా పెండింగ్ పనుల వివరాలను రప్పించుకుంది.రాష్ట్రంలో తొలి విడతగా 71 ప్రాజెక్టులకు ఊపిరిపోసింది. వాటిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న నల్లి క్రీక్ ఒకటి. పూడుకుపోయిన ఈ క్రీక్‌కు రూ.17.66 కోట్లు, నరసాపురం,యలమంచిలి మండలాల్లోని స్లూయిస్‌లకు రూ.8.8 కోట్లు కేటాయిస్తూ బుధవారం కేబినెట్ సమావేశంలో ఈ పనులకు ఆమోదం తెలిపింది. దీనిపై గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాజ, ఈస్ట్ కొక్కిలేరుకు మోక్షం

గోదావరి పరీవాహక ప్రాంతాల్లో వరద నియంత్రణకు స్లూయిస్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. పోటు పాటులకు నీరు బయటకు పోకుండా ఇవి అడ్డుగా నిలుస్తాయి. వరదల సమయంలో నీరు పంట కాల్వలు, డ్రైనేజీల గుండా వెళ్లకుండా నియంత్రించడంలో స్లూయిస్‌లు కీలకం. ఈ స్లూయిస్‌ల నిర్వహణ సక్రమంగా లేక ఇవన్నీ శిథిలావస్థకు చేరాయి. యలమంచిలి మండలం కాజ, నరసాపురం మండలం ఈస్ట్ కొక్కిలేరు, ముస్కేపాలెం, నరసాపురంలోని ఐదు తూములు వీటిలో ప్రధానం. కాజ స్లూయిస్ వల్ల వరదల సమయంలో వేలాది ఎకరాలు నీట మునిగాయి. ఇటు నరసాపురం మండలంలోని ఈస్ట్ కొక్కిలేరు పనులు చేపట్టమని గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు రైతులు అనేక ఉద్యమాలు చేపట్టారు. శిథిలమైన కొక్కిలేరు పనులు చేపట్టకపోవడంతో తీర ప్రాంతంలోని రైతులు సాగు విరమించారు. నరసాపురం పట్టణంలోని ఐదు తూముల గేట్లన్నీ శిథిలమయ్యాయి. వరదలు వస్తే నీరంతా డ్రెయిన్లలోకి చేరుతుంది. ఫలితంగా చినమామిడిపల్లి, సరిపల్లి, లిఖితపూడి, మల్లవరం, మల్లవరంలంక ప్రాంతాల్లో వేలాది ఎకరాలు నీట మునిగిపోతున్నాయి. ముస్కేపాలెం స్లూయిస్‌ది ఇదే పరిస్థితి. వరదొస్తే పీచుపాలెం ప్రాంతంలోకి నీరు చేరుతుంది. అత్యవసరంగా చేపట్టాల్సిన ఈ పనులకు తొలి విడతలో రూ.8.8 కోట్లు ఇచ్చారు.

ఎన్నికల హామీ అమలు చేశాం

అధికారంలోకి వస్తే మత్స్యకారులకు ఉపాధిని పెంచే నల్లి క్రీక్ తవ్వకం పనులు చేపడతామని ఇచ్చిన హామీ మేరకు తొలి విడతలోనే నల్లి క్రీక్ పనుల ఆవశ్యకతను ప్రభుత్వం గుర్తించి రూ.17.66 కోట్లు మంజూరుచేసినట్లు మత్స్యకార సహకార సమైఖ్య చైర్మన్ కొల్లు పెద్దిరాజు చెప్పారు. ఈ పనులు పూర్తయితే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.



నల్లిక్రీక్

నాడు వైసీపీ చేసిన పనికి..

రాష్ట్ర విభజన తర్వాత అప్పటి టీడీపీ ప్రభుత్వం నల్లి క్రీక్ తవ్వక పనులకు రూ.17 కోట్లు కేటాయించింది. 20 శాతం పనులు పూర్తయ్యాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం చేపట్టిన పనులన్నీ మధ్యస్థంగా నిలిపివేసింది. ఐదేళ్లుగా ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. బియ్యపుతిప్ప నుంచి మొగల్తూరు మండలం మోళ్లపర్రు వరకు 11 కిలోమీటర్ల క్రీక్ తవ్వక పనులు చేపడితే సంప్రదాయ మత్స్యకారులకు ఉపాధి దొరుకుతుంది. వేట నిషేధ సమయంలో మత్స్యకారులు వలస వెళ్లాల్సిన పని ఉండదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా ప్రభుత్వం తొలి విడతలో దీనికి రూ.17.66 కోట్లు మంజూరు చేయడంపై మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పశుగ్రాసానికి కోత

- సబ్సిడీ దాణాకు డిమాండ్ ఎక్కువ.. సరఫరా తక్కువ..
- గత నెలలో 250 టన్నులకు వచ్చింది 169 టన్నులే
- సమీకృత దాణా కోసం పాడి రైతుల ఎదురుచూపు

పాలకొల్లు, జూలై 10(ఆంధ్రజ్యోతి):పాడి పశువులు పశుగ్రాసం కొరత ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం సబ్సిడీపై అందించే దాణా ఏ నెలకా నెల తగ్గిపోతోంది. గత నెలలో జిల్లాకు 250 టన్నులు పశువుల దాణా ఇవ్వగా ఈ నెలకు 169 టన్నులే మంజూరైంది. జగన్‌రెడ్డి పాలనలో ఆఖరి ఏడాది పశువులకు సబ్సిడీ దాణా అందలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం సబ్సిడీ దాణా పుష్కలంగా వస్తుందని రైతులు ఆశించారు. ఇప్పుడు పరిస్థితుల్లో పెద్దగా మార్పు కనిపించలేదు. జిల్లాలో పాడి గేదెలు 1,57,000, ఆవులు 40,437 ఉన్నాయి. వీటికి పూర్తిస్థాయిలో సబ్సిడీ దాణా అందించాలంటే ఇప్పుడు మంజూరుకంటే మూడు రెట్లు అధికంగా ఉండాలి. గత నెలలో 250 టన్నులు జిల్లాకు రాగా పాలకొల్లు మండలానికి 12.5 శాతం టన్నులు సరఫరా చేశారు. ఇప్పుడు మరింతగా తగ్గింది. మండలానికి ఎనిమిది టన్నులు మాత్రమే వచ్చే అవకాశం ఉంది. గత ప్రభుత్వం హయాంలో టీఎంఆర్ (టోటల్ మిక్సిడ్ రేషన్) అందించగా ఇప్పుడు కనికలు సమీకృత దాణా సబ్సిడీపై ఇస్తున్నారు. టీఎంఆర్ దాణా వలన పశువులకు పొట్ట నిండటం తక్కువ. పాల ఉత్పత్తి పెరిగే అవకాశం లేదు. ఇప్పుడు సరఫరా చేస్తున్న సమీకృత దాణాలో 16 నుంచి 20 శాతం ప్రొటీన్లు ఉండటం వల్ల పాల ఉత్పత్తి పెరుగుతుందని పశుసంవర్థక శాఖ అధికారులు చెబుతున్నారు. కనికలు 50 కిలోలు బస్తాకి రూ.500 ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుండగా రైతులు రూ.550 చెల్లించాలి. ఇప్పుడు సబ్సిడీపై సరఫరా చేస్తున్న సమీకృత దాణా పాడి పశువులకు పెట్టడం ద్వారా పాల ఉత్పత్తులు పెరుగుతాయి. రైతులు పోషిస్తున్న పశువులు సంఖ్య ఆధారంగా సబ్సిడీ దాణా అందించాలని రైతులు కోరుతున్నారు.

అధిక పాల దిగుబడి

సమీకృత దాణాతో పాలదిగుబడి పెరుగుతోందని రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. అయితే ప్రస్తుతం డిమాండ్‌కు తగ్గ సరఫరా సాధ్యం కానప్పటికీ వచ్చినంత మేరకు మండలాల వారీగా సబ్సిడీ దాణా సరఫరా చేస్తున్నాం. రైతులు సబ్సిడీ దాణాతోపాటు మార్కెట్‌లో లభ్యమయ్యే దాణాలను పశువులకు పెట్టడం ద్వారా పాల దిగుబడి మరింత పెరుగుతుంది. పశు పోషణలో మెలకువలు పాటించడం ద్వారా అధిక పాల దిగుబడి సాధించవచ్చు.

- కె.మురళీకృష్ణ, పశుసంవర్ధక శాఖ జేడీ

గోదావరికి వరదపోటు

- పునరావాస కాలనీలకు నిర్వాసితులు

కుక్కునూరు/వేలేరుపాడు, జూలై 10(ఆంధ్రజ్యోతి): గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. మహారాష్ట్రతోపాటు తెలంగాణలో కురిసిన వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గురువారం సాయంత్రం నీటిమట్టం 26 అడుగులకు చేరింది. శుక్రవారం ఉదయానికి 32 అడుగులకు చేరుకుని శనివారానికి మొదటి ప్రమాద హెచ్చరిక 43 అడుగులకు చేరుకోవచ్చని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. ఈ క్రమంలో కుక్కునూరు మండలం గొమ్ముగూడెం, లచ్చిగూడెం గ్రామాలకు స్థానికాధికారులు వెళ్లి నిర్వాసితులను అప్రమత్తం చేస్తున్నారు. గొమ్ముగూడెంకు చెందిన పది నిర్వాసిత కుటుంబాలు దాచారం పునరావాస కాలనీకి తరలి వెళ్లారని తహసీల్దార్ రమేశ్‌బాబు తెలిపారు. వేలేరుపాడు మండలం రేపాక గొమ్ము, తాటుకూరుగొమ్ము, తిరుమలాపురం, రుద్రమ్మకోటలలో కొన్ని కుటుంబాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోగా మిగిలిన వారు ఆ ప్రయత్నంలోనే ఉన్నారు.

నిర్వాసితుల పేరుతో ఏజెన్సీలో భూ కుంభకోణం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

బుట్టాయగూడెం, జూలై 10(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు గిరిజన నిర్వాసితుల పేరుతో ఏజెన్సీలో భూకుంభకోణం జరుగుతుందని, భూముల కొనుగోలు పేరుతో కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. వివాదాలున్న భూములను అధికారులు ఏవిధంగా కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఏజెన్సీలోని పలు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. రెడ్డిగణపవరం, ఇనుమూరు ప్రాంతాల్లో గిరి జనుల స్వాధీనంలో ఉన్న ఎల్‌టీఆర్ భూముల్లో ఎర్రజెండాలు పాతారు. ఎల్‌టిఆర్., 1/70 చట్టం పరిధిలోని భూముల జోలికి వస్తే గిరిజనుల తరఫున సీపీఎం పోరాటం చేస్తుందన్నారు. గిరిజనేతరుల ఆక్రమణలో ఉన్న భూములకు పరిహారం కూడా చెల్లించనక్కరలేదన్నారు. ఏజెన్సీలో భూములన్నీ గిరిజనులకే చెందుతాయని, వాటిని ఆర్ అండ్ ఆర్‌లో ఏవిధంగా సేకరిస్తారని ప్రశ్నించారు. వివాదాలు లేని భూములనే కొనుగోలు చేసి గిరిజన నిర్వాసితులకు ఇవ్వాల న్నారు. అధికారులు వివాదాలు ఉన్న భూములను సేకరించి గిరిజనుల మధ్య గొడవలు పెడుతున్నారని శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల కొనుగోలు చేయడా నికి అధికారులు చూపించిన భూములను పరిశీలించిన నిర్వాసితులు వివాదాలు ఉన్న విషయాలను తెలుసుకుని తిరస్క రించారని అధికారులు గుర్తించాలన్నారు. బుట్టాయగూడెం సమీపంలో అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్వాసితుల కాలనీ లు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను పరిశీలించి ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి డిగ్రీ కాలేజి నిర్మాణం ముందుకు సాగడ లేదని, గిరిజనుల విద్యపై ప్రభుత్వ చిత్తశుద్ధి ఏపాటిదో తెలుస్తుంద న్నారు. ఆసుపత్రి పనులను త్వరగా పూర్తిచేసి సేవలను అందుబాటులోకి తేవాలన్నారు. కాలనీలు కూలిపోయిన తర్వాత నిర్వాసితులను తరలిస్తారా? అంటూ ప్రశ్నించారు. రెండు నెలల్లో ఆసుపత్రి, కాలేజిలను పూర్తి చేయకుంటే జన సమీకరణ చేసి ఉద్యమాలను చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు మంతెన సీతారాం, బి.బలరాం, ఎ.రవి, టి.దుర్గారావు, టి.రామకృష్ణ, ఎం.నాగమ ణి, కారం భాస్కర్, ఎ.ఫ్రాన్సిస్, పి.నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ విలీనం చేయవద్దంటూ పెనుమంట్ర సర్పంచ్ దంపతుల ఆమరణ దీక్ష

పెనుమంట్ర, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పెనుమంట్ర ఎల్‌పి స్కూల్‌ను మెయిన్ స్కూల్లో విలీనం చేయవద్దంటూ దళిత సంఘాలకు మద్దతుగా గురువారం ఉదయం అమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు పెనుమంట్ర సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక దంపతులు తెలిపారు. 25 రోజుల నుంచి "మా స్కూలు మాకు కావాలి.. వేరే స్కూల్‌కి వెళ్లేది లేదంటూ" తల్లిదండ్రు లతో కలిసి అధికారులకు ఫిర్యాదులు చేశామని, అందోళనలు చేపట్టామని అయినప్పటికీ విద్యాశాఖ అధికారుల్లో చలనం లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో నిరాహార దీక్షకు దిగుతున్నట్లు మండల తహసీల్దార్ వై.రవి కుమార్‌కు సర్పంచ్ దంపతులు తెలిపారు. ఎంఈఓ-2 మోసపూరిత తీర్మానాలు చేసి విలీనం చేశారని ఆరోపించారు 28 మంది విద్యార్థులను వేరే పాఠశాలలో పంపించేది లేదంటూ తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని దీనిపై స్పందన లేకపోవడంతో ఆందోళన


తహసీల్దార్ రవికుమార్‌కు దీక్షకు సంబంధించిన పత్రం అందిస్తున్న గ్రామ సర్పంచ్

చేపట్టనున్నట్లు తెలిపారు. విలీనం చేసిన పాఠశాల వెనుకభాగంలో చెరువు ఉందని, పిల్లలకు ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యతను అధికారులు తీసుకుంటారా ? అని ప్రశ్నించారు. 11వ తేదీ ఉదయం 10 గంటలకు తహసీల్దార్ కార్యాలయం వద్ద దళిత సంఘాలకు మద్దతుగా తాము దీక్ష చేపడుతున్నామన్నారు.


సహస్ర దీపాల వెలుగులో ద్వారకాతిరుమల క్షేత్రదేవత కుంకుళ్లమ్మ

కుంకుళ్లమ్మకు సహస్ర దీప సేవ

ద్వారకాతిరుమల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): క్షేత్రదేవతగా విరాజిల్లుతోన్న కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం రాత్రి సహస్రదీప సేవ నిర్వహించారు. ఏడాదికోసారి ఆషాఢమాసంలో ఈ సేవను జరుపడం సంప్రదాయంగా వస్తోంది. ఆలయ ప్రాంగణం, పరిసరాలను సిబ్బంది సుందరీకరించారు. అనంతరం పలువురు భక్తులు ప్రమిదిలలో నూనె పోసి దీపాలను భక్తి ప్రపత్తులతో వెలిగించారు. దీపాల వెలుగులో ఆలయ పరిసరాలు దేదీప్య మానంగా వెలుగొందాయి. అమ్మవారి మూల విరాట్ వద్ద అర్చకులు దీపాలు వెలిగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



చెరువులో పంటల సాగు

వివాదంలో కొవ్వలి పెద్ద చెరువు

దెందులూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కొవ్వలి గ్రామంలో ఉన్న పెద్ద చెరువుపై ఏపీ హైకోర్టు ఇచ్చిన స్టేటస్ కో ఆర్డర్‌ను కొంత మంది ఉల్లంఘించి చెరువులో పంటలు పండించేందుకు చెరువులో నీటిని తీసి వేస్తున్నారని జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనురాధకు కొవ్వలి రైతులు ఫిర్యాదు చేశారు. పంచాయతీ చెరువును కొంత మంది రికార్డులను మార్చేసి మత్సకార సంఘాల పేరుతో సాగు చేస్తున్నారని కొవ్వలి గ్రామానికి చెందిన గ్రామ దీప్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డాక్టర్ వెలమటి మనోహరి గతంలో హైకోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉంటే తామంతా పేద దళితులమని చాలా సంవత్సరాలుగా పంటలు పండించుకుంటున్నామని మా పొట్ట కొట్టిందంటూ కొవ్వలి దళితులు నిరసన తెలుపుతున్నారు.

వివరాల్లోకి వెళితే దెందులూరు మండలంలోని కొవ్వలి గ్రామంలోని 304 ఎకరాల్లో పెద్ద చెరువు ఉంది. 1963లో ఈ భూమిలో ప్రభుత్వ వ్యవసాయ విత్తనాభివృద్ధి కేంద్రం, మత్స్య సంపద అభివృద్ధికి 126 ఎకరాలు కేటాయించారు. మిగిలిన చెరువు పంచాయతీ ఆధ్వర్యంలోనే ఉంది. కొంతకాలం కిందట వైసీపీ ప్రభుత్వంలో స్థానిక అధికారులకు ముడుపులు ఇచ్చి దళిత భూములుగా మార్చుకున్నారని ప్రచారం ఉంది. అయితే ఆర్ఎస్ఆర్ రికార్డుల్లో ఇప్పటికి నిషేధిత జాబితాలోనే ఈ భూమి చూపిస్తోంది. కొవ్వలి గ్రామంలోని కలకాలమ్మ, జమ్మి, పెద్ద పేర్నిటి, పసర, గొల్లవాని చెరువులు ఉన్నాయి. మొత్తం 180 ఎకరాల విస్తీర్ణంలో ఈ చెరువులు ఉన్నాయి. వీటిని వైసీపీకి చెందిన కొంత మంది మత్స్యకార సొసైటీ పేరుతో మూడేళ్ల కాలపరిమితికి లీజుకు తీసుకున్నారు. ఇక్కడ చేపల పెంపకం చేయలేనందున పంచాయతీలకు 2021- 2023 సంవత్సరం కాలంలో రూ.5 లక్షల 25 వేలు మాత్రమే చెల్లించారు. అయితే సబ్ లీజ్‌కు ఏడాదికి రూ.25 లక్షల చొప్పున మూడేళ్లకు రూ.75 లక్షలు వసూలు చేశారని ప్రచారం జరిగింది. పెద్ద చెరువు ఆక్రమాలపై 2023లో గ్రామ దీప్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డాక్టర్ వెలమాటి మనోహరి హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. దీనిపై జిల్లా అధికారులు విచారణ చేసి నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. నివేదిక ప్రకారం పెద్ద చెరువులో ఎలాంటి కార్యకలాపాలు చేయవద్దని 2024 ఆగస్టులో హైకోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది. కోర్టు తీర్పు రాకముందే గ్రామంలో పెద్దలతో మాట్లాడుకున్నామని సుమారు 200 మంది దళితులు వరి పంటను పండిస్తున్నామన్నారు. చెరువులో పంటలు వేసేందుకు చెరువులో నిల్వ ఉంచిన సాగునీటిని కిందకు వదులుతున్నారని వెంటనే హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

అభాగ్యులకు అండగా..



- ఆదరిస్తున్న శిశువిహార్
- దత్తత స్వీకారానికి ముందుకొస్తున్న పిల్లలు లేని తల్లిదండ్రులు
- ఈ నెలలోనే ముగ్గురు..

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఆర్థిక సమస్యలు, నిరక్షర్యాసత, వ్యక్తిగత కారణాలతో పలువురు పిల్లలను రోడ్ల మీద వదిలేస్తున్నారు.కొందరు చెత్తబుట్టలో పడేస్తున్నారు. అలాంటి అభాగ్యులను స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు శిశు గృహానికి తరలించి వారిని సంరక్షిస్తున్నారు. పిల్లలు లేని తల్లి దండ్రులకు వారిని చట్టబద్ధంగా దత్తత ఇస్తున్నారు. సంతాన లేమితో అమ్మా, నాన్న పిలుపునకు దూరమైన వారంతా మానవత్వం చాటుకుంటున్నారు. మరోవైపు రెండో సంతానం లేని వారు కూడా దత్తత తీసుకోవడానికి ముందుకు వస్తు న్నారు. జిల్లా వ్యాప్తంగా గడిచిన పదేళ్లలో ఇప్పటి వరకు 61 మంది చిన్నారులతో పాటు 18 ఏళ్ల లోపు వారిని అక్కున చేర్చుకున్నారు.

కొద్దికాలంగా పెళ్లైన జంటలను వేధిస్తున్న సమస్య సంతానలేమి. మరోవైపు మేనరిక వివాహాలతో పిల్లల్ని కంటున్నా ఏదో ఒక లోపం ఉండటంతో దత్తత బాట పడుతున్నారు. కోట్లు సంపాదించినా కన్నబిడ్డలు లేని లోటు ఎవరూ తీర్చలేనిది. మాతృత్వానికి దూరంగా ఉంటున్న


ఒక కుటుంబానికి బాలుడిని దత్తత ఇస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి (ఫైల్)

పలువురు తల్లిదండ్రులు దత్తతపై ఆసక్తి కనబ రుస్తున్నారు. దీంతో విధి వంచితులైన చిన్నా రులకు కొత్త జీవితాన్ని అందిస్తున్నారు.

దత్తత పొందడం ఇలా ..

పిల్లలను దత్తత తీసుకోవాలంటే వారి పాన్ కార్డు ద్వారా ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీ:// సీఏఆర్ఏ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసుకోవాలి. అన్ని ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దత్తత ఏజెన్సీకి వారికి రూ.6 వేలు డీడీ రూపంలో చెల్లించాలి. అలాగే బిడ్డను పొందే సమయంలో రూ.50 వేలు మరలా డీడీ రూపంలో ఇవ్వాలి. పాన్‌కార్డు, ఆదాయ, వయసు, నివాస, వివాహ, ఆరోగ్య ధ్రువపత్రాలతో పాటు దంపతుల ఫొటోలు అందించాల్సి ఉంటుంది.

పెంచగలిగే వయసు ఆధారంగా పిల్లల దత్తత

మహిళా, శిశు సంక్షేమశాఖ పర్యవేక్షణలో ఏలూరు నగరంలో విద్యానగర్‌లో ఉన్న శిశు గృహ ద్వారా ఒక పార్ట్‌టైమ్ డాక్టర్ ఇతర సిబ్బంది 12 మంది, ప్రభుత్వం పర్యవేక్షణలో విధివించుతులైన చిన్నారులు, ఆదరణ కరువైన వారిని సంరక్షిస్తుంటారు. కొత్తబస్టాండ్ రోడ్డు వద్ద ఉన్న జిల్లా బాల సంరక్షణాధికారి డాక్టర్ సూర్య చక్రవేణి పర్యవేక్షణలో తల్లిదండ్రులకు దత్త ఇస్తుంటారు. పెంచగలిగే వయసు ఆధారంగా నెలలు వయసు నుంచి 18 ఏళ్లలోపు బాలలు, యువత, యువకులను దత్తత ఇస్తారు. భార్యా భర్తలు వయసు కలిపి మొత్తం 90 ఏళ్ల ఉంటే రెండేళ్ల లోపువారిని, 95 సంవత్సరాలు దాటితే 4 ఏళ్ల వయసు దాటిన వారిని దత్తత ఇస్తారు. ఈశాఖ ద్వారా అన్ని లాంచనాలు పూర్తి చేసుకున్న తర్వాత కలెక్టర్ చేతుల మీదుగానే దత్తత స్వీకారం ఉంటుంది. దరఖాస్తు చేసిన వెంటనే దత్తత ఇవ్వరు. ఒక్కోసారి రెండేళ్ల నుంచి నాలుగేళ్ల సమయం వరకు పట్టొచ్చు.

ఆర్నెళ్లకు ఒకసారి పరిశీలన

జిల్లాలో ఇప్పటి వరకు 61 మందిని దత్తత ఇచ్చారు. దత్తత వెళ్లిన చిన్నారులు, యువత బాగోగులపై బాలల సంరక్షణాధికారి పర్యవేక్షణలో సిబ్బంది ఆర్నెళ్లకొకమారు ఆరా తీస్తుంటారు. అయితే ఇప్పటి వరకు తల్లిదండ్రులు దత్తత తీసుకుని వారితో ఇమడలేక ముగ్గురు వెనక్కి రాగా, ఇద్దరు మళ్లీ వివిధ చోట్ల చదువుకుంటున్నారు. ఒకర్ని మాత్రం ఇంకో కుటుంబానికి దత్తత ఇచ్చారు. ఒక్కోసారి ఇమడలేని వారికి కూడా కౌన్సెలింగ్ ఇచ్చి సర్దిచెప్పి వెనక్కి పంపిన సందర్భాలున్నాయి. ఇదిలా ఉండగా వివిధ ఎన్జీవోల సంరక్షణలో ఉన్న చిన్నారులు, యువతను కూడా దత్తత ఇచ్చే బాధ్యతలను బాలల సంరక్షణాధికారే చూడాల్సి ఉంటుంది. కలెక్టర్ పర్యవేక్షణలోనే దత్తత ఇవ్వాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. విధి వంచితులు ఉన్నతంగా ఎదగాలని కలెక్టర్ వెట్రిసెల్వి ప్రత్యేక శ్రద్ధతో వారిని పలకరించడం, బాగోగులను ఆరా తీయడంతో అధికారులు కూడా సానుకూలంగా పనిచేస్తున్నారు.

వారి కళ్లలో ఆనందం చూస్తున్నాం



సంతాన లేమితో చాలా మంది బాధపడుతూ పిల్లల్ని దత్తత తీసుకోవడానికి మా దగ్గరికి వస్తుంటారు. వారి పిల్లలను తీసు కెళ్లినప్పుడు వారి కళ్లలో ఆనందం వర్ణించ లేనిది. పిల్లల దత్తత మాద్వారా చట్టబద్దత ఉంటుంది. ఆస్తులున్న వారే మానవత్వంతో మరోబిడ్డను సాకాలని మా దగ్గరికి వస్తుం టారు. ఆదరణ లేని వారికి జీవితాన్ని ఇచ్చామనే అనుభూతిని వారు ఆస్వాదిస్తు న్నారు. ఒక్కరు అబ్బాయి కలిగి ఉంటే వారికి తోడుగా అమ్మాయి, అమ్మాయి ఉంటే అబ్బాయిని తోడుగా దత్తత తీసుకుంటున్నారు. ఇది మంచి శుభపరిణామం. దత్తత తీసు కోదలచిన వారు 08812-232871 నంబర్ లేదా 1098 నంబర్‌లో సంప్రదించవచ్చు.

- డాక్టర్ సూర్యచక్రవేణి, జిల్లా బాలల సంరక్షణాధికారి, ఏలూరు

హలో ! కొట్టేస్తారు..



మాయల పకీర్ ప్రాణం చిలకలో ఉన్నట్లు నేడు మానవుడి ప్రాణం తన చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌లో చిక్కుకుపోయింది. సెల్‌ఫోన్ నేడు నిత్యావసర వస్తువులా మారిపోయింది. కిరాణా కొనుగోలు నుంచి బ్యాంకు లావాదేవీల వరకు అన్నిటికి సెల్‌ఫోనే ఆధారమైపోయింది. అలాంటి ఫోన్ ఎవరైనా తస్కరిస్తే గుండె ఆగినంత పనవుతుంది. ఫోను పోతే పోయింది. కానీ అందులో డేటా ఎలా అంటూ కుమిలిపోయే పరిస్థితి ఉంది. మొబైల్ దొంగలు చాకచక్యంగా ఫోన్లు తస్కరిస్తున్నారు. లక్షల విలువైన ఫోన్లు కూడా సెకన్లలో కొట్టేస్తారు. ఇటీవల సెల్‌ఫోన్ చోరీలు భారీగా పెరగడంతో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఎక్కడ మొబైల్ చోరీకి గురైనా వెంటనే వాట్సప్ నంబర్‌కు ఫిర్యాదు చేస్తే కొద్ది రోజుల్లోనే ఫోన్‌ను రికవరీ చేసి బాధితులకు అప్పగిస్తున్నారు.

ఆరు నెలల క్రితం తాడేరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కుటుంబంతో ఊరు వెళ్ళడానికి జంక్షన్ రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కుతుండగా సుమారు లక్షా 50 వేల విలువ గల మొబైల్ ఫోన్‌ను దొంగలు దోచుకున్నారు. తీరా రైలు ఎక్కి చూసుకునేసరికి మొబైల్ కనబడలేదు. అనంతరం కంగారు పడి అన్నిచోట్ల వెదికినా ఫలితం దక్కలేదు. జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎస్పీ కార్యాలయంలో ఉన్న వాట్సప్ నంబర్‌కు ఫోన్ చేయమన్నారు.

రెండు నెలల క్రితం ఒక వ్యక్తి భీమవరం శివారు బొక్కావారి పాలెం వద్ద రోడ్డు పక్కన ద్విచక్ర వాహనం ఆపి సెల్ ఫోన్ మాట్లాడుతుండగా భీమవరం వైపు నుంచి పాలకొల్లు వైపు వెళ్ళే ఇద్దరు వ్యక్తులు మొబైల్ ఫోన్‌ను లాక్కుని పరారయ్యారు. బాధితుడు వెంటనే జిల్లా ఎస్పీ కార్యాలయంలోని వాట్సప్ నంబర్‌కు ఫిర్యాదు చేశారు.

పాలకొల్లుకు చెందిన ఒక మహిళ తన రెండు మొబైల్ ఫోన్లను బ్యాగులో పెట్టుకుని బస్టాండ్‌లో బస్సు ఎక్కే సమయంలో దొంగలు చాకచక్యంగా రెండు ఫోన్లను దొంగిలించారు. వాటి విలువ సుమారు రూ. 3 లక్షల వరకు ఉంటుందని ఇతర దేశాల నుంచి తన కుమారుడు పంపించాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు.

తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై వెళుతూ వర్షం వస్తుందని చెట్టు నీడలో తమ వాహనాన్ని ఆపడంతో గుర్తు తెలియని దుండగులు బైక్‌పై వచ్చి వారి వాహనానికి ఉన్న బ్యాగును దొంగిలించుకుపోయారు. ఆ బ్యాగులో రెండు ఫోన్లతో పాటు కొద్దిగా నగదు కూడా ఉంది.

భీమవరం క్రైం, జులై 10 (ఆంధ్రజ్యోతి) : ఆదమరిస్తే దొంగలు క్షణాల్లో ఫోన్లు కొట్టేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాగా ఏర్పడ్డాక


బాధితురాలికి ఫోన్ అందిస్తున్న ఎస్పీ నయీం అస్మి

- ఇటీవల పెరిగిన మొబైల్ చోరీలు
- ఫోన్ల రికవరీ కోసం పోలీసు ప్రత్యేక టీమ్
- పశ్చిమలో ఇప్పటి వరకు 1,612 రికవరీ

ఇప్పటి వరకు 1,612 ఫోన్లు (రూ.2 కోట్ల 40 లక్షల 30 వేలు) రికవరీ చేసినట్టుగా అధికారులు చెబుతున్నారు. ఇప్పటికి 9 సార్లు జిల్లా ఎస్పీలు ప్రెస్‌మీట్‌లు పెట్టి బాధితులకు ఫోన్లు అప్పగించారు. గతేడాది జూలై నుంచి ఈ ఏడాది ఇప్పటి వరకు 290 ఫోన్లు (43 లక్షల 50 వేలు) రికవరీ చేసినట్టుగా పోలీసు రికార్డులు చెబుతున్నాయి. జిల్లా పోలీసులు పోలీసు ఉన్నతాధికారుల అభినందనలు కూడా అందుకున్నారు.ఇతర జిల్లాల పోలీసులు అక్కడ పోయిన ఫోన్ల వివరాలను కూడా ఇక్కడ వాట్సప్ నంబర్‌కు పొందుపరిచే విధంగా బాధితులకు సూచనలు ఇస్తున్నారు.

పెరిగిన ఫోన్ల వాడకం

ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్ లేని వ్యక్తి లేరంటే అతిశయోక్తి కాదు. ప్రతి ఒక్కరికి మొబైల్ తప్పనిసరైపోయింది. వేసుకునే వస్త్రాలతో పాటుగా మొబైల్ కూడా తప్పనిసరిగా వెంట తీసుకుని వెళ్ళవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫోన్ల ఖరీదు కూడా కొన్ని లక్షల్లో ఉంటున్నాయి. ప్రయాణ సమయాల్లో ఆదమరిస్తే దొంగలు ఫోన్లు కొట్టేస్తున్నారు. బాధితులు లబోదిబోమంటున్నారు.మొబైల్‌లో ఉన్న డేటా పోవడం వల్ల చాలామంది ఇబ్బందులు పడుతున్నారు.

ఫోన్ల రికవరీలో ముందంజ

జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 91549 66503 అనే వాట్సప్ నంబర్ ద్వారా వేలల్లో ఫోన్లు రికవరీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సెల్‌ఫోన్ రికవరీ కోసం ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఎవరిదైనా మొబైల్ చోరీకి గురైతే వాట్సప్ నంబర్‌కు హాయ్ అని పెట్టగానే అవతలి నుంచి ఒక అప్లికేషన్ వాట్సప్‌కు వస్తుంది. అప్లికేషన్‌లో బాధితుడి పేరు, తండ్రి పేరు, మొబైల్ ఐఎంఈఐ -1, ఐఎంఈఐ 2 నంబర్లు, అడ్రస్, పోయిన ఫోన్‌లో ఉన్న నంబరు తదితర వివరాలను అందులో పొందుపరచగానే వారు ఫిర్యాదు నమోదు చేసుకుంటారు. 10-15 రోజుల్లో సర్కిల్ ఐటీ కోర్ నుంచి బాధితుడికి ఫోన్ వస్తుంది. వివరాలు తీసుకుని ఫోన్ ఐఎంఈఐ నంబర్ ద్వారా ట్రాక్ చేస్తారు. తర్వాత ఆ ఫోన్ ఎక్కడ ఉందో తెలుసుకుని వారికి ఫోన్ చేస్తారు. ఫోన్ ఎత్తిన అవతలి వారు దొరికిందనో, తెలియక కొన్నామనో అని చెప్పి స్వచ్ఛందంగా ఆ ఫోన్లను పోలీసులకు అందజేస్తారు. వాటి నంబర్ల ఆధారంగా పోలీసులు బాధితులకు అప్పగిస్తారు.


రికవరీ చేసిన ఫోన్ అందిస్తున్న ఎస్పీ కిషోర్ (ఫైల్)

ఏలూరు జిల్లాలో 2,976 రికవరీ

ఏలూరు క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలో ఇప్పటికి 15 పర్యాయాల్లో 2,976 ఫోన్లు (సుమారు 4 కోట్ల 75 లక్షల రూపాయలు)లను బాధితులకు అందజేశారు. గతంలో ఫోన్లు ఎవరైనా తస్కరిస్తే ఇన్సూరెన్సులు ఉన్నవాటికి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం, లేదా నాట్ ట్రేస్‌డు సర్టిఫికెట్ పొంది మరో ఫోనును ఇన్సూరెన్సు ద్వారా పొందేవారు. ఫోన్ పోతే ఎక్కడ ఉన్నా రికవరీ చేసి అందజేస్తామంటూ పోలీసు శాఖ ప్రత్యేక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఫోను పోతే వెంటనే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసేందుకు వాట్సప్ నంబర్ 95503 51100ను అందుబాటులోకి తెచ్చారు. ఆ నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పెట్టగానే అందుబాటులో సర్వీసులు మెస్సేజ్ వస్తుంది. తరువాత ఫోన్‌కు సంబంధించిన ఐఎంఈఐ నెంబర్లు, బిల్లు, ఫిర్యాదుదారుని ఆధార్‌కార్డు వివరాలు, ఫోన్ నెంబర్ వంటివి నమోదు చేసి సబ్‌మిట్ చేస్తే పోలీస్ శాఖకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదవుతుంది. ఆ తరువాత పోలీసులు ఆ ఫోన్ ఎక్కడ ఉన్నా ఎవరు వాడుతున్నా ఇట్టే పసిగట్టి రికవరీ చేస్తారు.

వెంటనే ఫిర్యాదు చేయాలి : ఎస్పీ కిషోర్

నేడు ప్రతి ఒక్కరికి సెల్‌ఫోన్ ముఖ్యమైన వస్తువుగా ఉంది. ఇలాంటి ఫోను పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రిపోర్టు చేయాలి. జిల్లాలో ఇప్పటి వరకూ 2,976 ఫోన్లు సుమారు 4 కోట్ల 75 లక్షల రూపాయల విలువైన వాటిని రికవరీ చేసి ప్రజలకు అందజేశాం. ఈ ఫోన్లు ఇతర జిల్లాల్లో, రాష్ట్రాల్లో యూజర్ల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నాం. జిల్లాలో ఎవరైనా దొంగిలించిన వస్తువులను కొనడం, అమ్మడం నేరం. మూడు సంవత్సరాలు జైలు శిక్ష, జరిమానా కూడా విధిస్తారు. రైతు బజార్లు, మార్కెట్లు, జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, ఏటీఎంల వద్ద దృష్టి మళ్ళించి సెల్‌ఫోన్లు అపహరించే ముఠాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

ఈ వంతెనలకు మోక్షమెప్పుడో ?

ఉంగుటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరుతో పాటు మండలంలోని పలు వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉంగుటూరు వంతెనపై నిత్యం వందలాది వాహనాలు వెళుతుంటాయి. టోల్ గేట్‌ను తప్పించుకునేందుకుగాను భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో నారాయణపురం వంతెనలా శిథిలావస్థకు చేరుకుంటుందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాదంపూడి గ్రామాన్ని తాడేపల్లిగూడెంను కలిపే దారిలో ఉన్న ఏలూరు కాల్వపై ఉన్న వంతెన కూడా మరమ్మతులకు గురవడంతో ఆందోళన చెందుతున్నారు నారాయణపురం మరుక్కోడు వంతెన కూడా .మధ్య మధ్యలో పెచ్చులూడి పోవడం పైగా భారీ వాహనాల రాకపోకలు జరుపడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సీతారాంపురం శివారులోని వంతెన వద్ద ఇటీవల ద్వారకా తిరుమల నుంచి వస్తున్న ఆటో అదుపు తప్పి పెను ప్రమాదం తప్పింది. వంతెనల కు మరమ్మతులు అయినా చేయాలని కోరుతున్నారు. నారాయణపురం వంతెనకు శాశ్వత పరిష్కారం చేయాలని గ్రామానికి చెందిన పాతూరి సత్యనారాయణ కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన ఉంగుటూరు వంతెన



పట్టిసీమ నుంచి 7,788 క్యూసెక్కుల నీరు విడుదల

పోలవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 7,788 క్యూసెక్కుల జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు ఈఈ ఏసుబాబు బుధవారం తెలిపారు. గోదావరి నీటిమట్టం 18 మీటర్లకు పైబడి ఉండడంతో 22 మోటార్లు 22 పంపుల ద్వారా నీరు విడుదల చేసినట్లు తెలిపారు.

వ్యవసాయం.. జీవన విధానం

ఉద్యాన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో గవర్నర్ నజీర్

ఉంగుటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం కేవలం జీవనోపాధి సాధనం కాదని, అది జీవన విధానమని గవర్నర్, ఉద్యాన విశ్వవిద్యాలయం కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రజామందిరంలో గురువారం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆరో స్నాతకోత్సవం నిర్వహించారు. గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహించి డిగ్రీ పూర్తిచేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ముఖ్యఅతిథి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్, నేషనల్ అకాడమి ఆఫ్ అగ్రికల్చర్ అండ్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(ఐసీఏఆర్ -ఎన్ఏఏఆర్ఎం) డైరెక్టర్ డాక్టర్ గోపాల్‌లాల్ స్నాతకోపన్యాసం చేశారు. గవర్నర్ మాట్లాడుతూ హార్టీకల్చర్ యూనివర్సిటీ స్థాపించిన ఒకటిన్నర దశాబ్ద కాలంలోనే ఉద్యానవన విద్య, పరిశోధన, విస్తరణలో ప్రభావవంతమైన కృషి అభినందనీయమన్నారు. పట్టభద్రులవుతున్న విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. ఉపకులపతి కె.గోపాల్ విశ్వవిద్యాలయం ఏర్పాటు, అందిస్తున్న కోర్సులు, సాధించిన విజయాలు, పురోభివృద్ధి గురించి వివరించారు. అనంతరం అతిథుల చేతులమీదుగా బంగారు పతకాలు సాధించిన 10మంది విద్యార్థులతోపాటు 38మంది పీహెచ్‌డీ స్కాలర్లు, 119మంది పీజీ, 1152మంది బీఎస్సీ(ఆనర్స్)పట్టభద్రులకు డిగ్రీలు ప్రదానం చేశారు. 2023నుంచి 2025వరకు అత్యుత్తమ సేవలు అందించిన కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వి.దీప్తికి బెస్ట్ ఎక్స్‌టెన్సన్ సైంటిస్ట్ అవార్డు, డాక్టర్ కె.లలితకు బెస్ట్ టీచర్ అవార్డు, వి.శివకుమార్‌లకు బెస్ట్ సైంటిస్ట్ అవార్డులు, అందజేశారు.



కక్షిదారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

కేసుల పరిష్కారంపై దృష్టి పెట్టండి

ఏలూరు క్రైం, జూలై 10(ఆంధ్రజ్యోతి):కేసులు త్వరితగతిన పరిష్కారం కావడంపై న్యాయవాదులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి సూచించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అధ్యక్షతన జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం కక్షిదారులకు 'మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారంపై అవగాహన కలిగించారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవడం వల్ల ఉపయోగాలను వివరించారు. జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి శుక్రవారం 1 కే వాక్ నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో ఏలూరు కోర్టుల పరిధిలోని న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, పోలీస్ సిబ్బంది, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు సిబ్బంది పాల్గొంటారన్నారు. న్యాయాధికారులు వై.శ్రీనివాసరావు, కె.రత్నప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మునిసిపల్ మేనేజర్‌తో వాగ్వాదం

ఆకివీడు, జూలై 10(ఆంధ్రజ్యోతి):డోర్ నెంబర్ కేటాయింపులో ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని ఏఎంసీ మాజీ చైర్మన్ ఎండీ మస్తాన్‌వలీ, బాసిత్ మునిసిపల్ మేనేజర్‌తో వాగ్వాదానికి దిగారు. వారు గురువారం నగర పంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఆర్ఎస్ నెంబర్ తప్పు ఉన్నప్పటికీ డోర్ నెంబర్ ఎలా కేటాయిస్తారని మేనేజర్ వెంకటేశ్వరరావును ప్రశ్నించారు. పంచాయతీ స్థాయిలో ఉన్నపుడు డోర్ నెంబర్ కేటాయించారని, అభ్యంతరం ఉంటే లిఖితపూర్వకంగా తెలియజేయాలని మేనేజర్ సూచించడంతో వారిద్దరూ వాగ్వాదానికి దిగి కార్యాలయం బయట బైఠాయించారు. మేనేజర్‌పై పలు ఆరోపణలు చేశారు. దీనిపై మేనేజర్ తన విధులకు ఆటంకం కలిగించారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హనుమంతు నాగరాజు విచారణ అనంతరం చర్యలు చేపడతామన్నారు. ఈ ఘటన నేపథ్యంలో మేనేజర్ ఒత్తిడి గురై అస్వస్థతతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

రూ.10 లక్షల విలువైన 110 ట్రాన్స్‌ఫార్మర్ల అపహరణ



దేవరపల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి):విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగిదిమ్మలు దొంగిలించిన అంతర్ జిల్లా దొంగల ముఠాను అరెస్టు చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్‌లో రాగి వైర్ల కోసం దొంగతనాలు ఎక్కువగా జరుగుతుండడంతో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ టీమ్‌లు సీసీ కెమెరాల సహకారంతో నలుగు రు అంతర్‌జిల్లాల దొంగలను దేవరపల్లిలో అరెస్టు చేసినట్టు తెలిపారు. రాగి వైరు కొనుగోలు చేసిన ఇద్దరు వ్యాపారులను అరెస్టు చేసినట్టు చెప్పారు. ఉమ్మ డి ఉభయ గోదావరి జిల్లాల్లో 115 ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించినట్టు తెలిపారు. వాటి విలువ రూ.10 లక్షలు ఉంటుందన్నారు. చోరీకి పాల్పడిన వీరవాసరం మండలం రాయకుదురుకు చెందిన కడలి సతీష్, అత్తిలి మండలం మంచిలికి చెందిన బళ్లా విజయరత్నం, భీమవరం మండలం దెయ్యాలతిప్పకు చెందిన ఏలూరు పోసియ్య, ఎన్టీఆర్ జిల్లా కృత్తివెన్ను మండలం లక్ష్మీపురానికి చెందిన వేంద్రపు దుర్గాశ్రీనివాస్, వీరితోపాటు చోరీ సొత్తు కొన్నవారు భీమవరం మండలం గొల్లవానితిప్పకు చెందిన పావురాయిల కోటేశ్వరరావు, దిరుసుమర్రుకు చెందిన నవరపు భీమారావును అరెస్టు చేశారు. రెండు కార్లు, రెండు మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసును చేధించిన దేవరపల్లి సీఐ బీఎస్.నాయక్‌ను, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, రాజమండ్రి సీసీఎస్ సీఐ శ్రీధర్ కుమా ర్, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. దేవరపల్లి విద్యుత్ శాఖ ఏఈ సీహెచ్ వెంకట్రావు పాల్గొన్నారు.



ప్రమాదకరమైన వస్తువులు, రసాయనాలు, మందుగుండు సామగ్రి ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు జనావాసాల చేరువలో నిర్వహించకూడదు. ప్రధానంగా విద్యా సంస్థలు, ఆసుపత్రులకు వాటికి 500 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసుకోవాలి. ఈ నిబంధనలు జిల్లాలో అమలు కావడం లేదని ఇటీవల వరుస అగ్ని ప్రమాదాలతో స్పష్టమవుతోంది. పరిశ్రమలశాఖ, అగ్నిమాపక శాఖ, పోలీసు, రెవెన్యూ శాఖాధికారుల తీరుపై పలు విమర్శలు వస్తున్నాయి. పరిశ్రమల శాఖ అధికారులు పరిశీలన చేయకుండా అనుమతులు ఇవ్వడంతో ప్రమాదాలకు కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రమాదాల ఫ్యాక్టరీలు

- జనావాసాల మధ్య ప్రమాదకర పరిశ్రమలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- శాఖాపరమైన తనిఖీలు లేవు!
- మూడు నెలల్లో మూడు భారీ ప్రమాదాలు



ఏలూరు సమీపంలోని పరుపుల తయారీ కంపెనీలో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఏలూరు క్రైం, జూలై 10(ఆంధ్రజ్యోతి):పరిశ్రమల ఏర్పాటులో పరిశ్రమలు, పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, విద్యుత్‌శాఖ అధికారుల సంయుక్త తనిఖీలు లేవు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలోనే సంయుక్త తనిఖీలు చేయాల్సి ఉంది. ఆశాఖ అధికారులు పనితీరులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎక్కడ బడితే అక్కడ జనవాసాల మధ్య ప్రమాదకరమైన ఫ్యాక్టరీలు ఏర్పాటవుతున్నాయి. ఇటీవల 3 భారీ అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఏప్రిల్‌లో సోమవరప్పాడు వద్ద దుర్గ క్వాయర్ ఇండస్ట్రీ దగ్ధమైంది. రోడ్డు ప్రక్కనే ఈ కంపెనీ నెలకొల్పారు. వాస్తవానికి అంత దగ్గరలో అనుమతులు ఇవ్వకూడదు. తంగెళ్లమూడిలోని గణేశ్ కుషన్ కంపెనీ మే నెలలో దగ్ధమైంది. ఇది కూడా కోట్ల రూపాయల్లోనే నష్టం వాటిల్లింది. ఈ రెండింటిలో ఒకటి షార్ట్‌షార్క్యూట్ మరొకటి వెల్డింగ్ చేస్తుండగా రవ్వలు అంటుకుని అగ్ని ప్రమాదం సంభవించింది. ఏలూరు సమీపంలోని కొత్తూరురోడ్డు, వంగాయిగూడెం క్యాన్సర్ ఆసుపత్రి ఎదురుగా సుస్మిత ఫర్నిచర్ కుషనింగ్ కంపెనీలో అగ్నిప్రమాద సంఘటనతో అధికారులే అవాక్కయ్యారు. భారీ యంత్ర సామగ్రి, ఒకే గోడౌన్‌లో తయారీ ప్రక్రియ జరుగుతుంది. స్పాంజ్, రకరకాల ఫోమ్స్ తయారీ, బాయిల్డ్ ట్యాంకులు, కెమికల్ ట్యాంకులు, పరుపుల తయారీకి వినియోగించే ముడి సామగ్రి అంతా అక్కడే ఉన్నాయి. భారీగా స్పాంజ్ తయారు చేసిన నిల్వలు ఉండడంతో ఒక్కసారిగా ప్రమాదం సంభవించి మూడు గంటల పాటు దట్టమైన పొగలు అలముకున్నాయి. వాస్తవానికి ఈ పరిశ్రమకు అనుమతి ఇవ్వకూడదు. ఎదురుగా క్యాన్సర్ ఆసుపత్రి, పక్కనే ఫంక్షన్‌హాలు, మరోవైపు జనవాసాలున్నాయి. పరిశ్రమలు, అగ్నిమాపక శాఖ అధికారులు అనుమతి ఎలా ఇచ్చారో అంతుపట్టని విషయం.

పరిశ్రమపై ఫిర్యాదులు

జాయింట్ యాక్షన్ కమిటీ తనిఖీలకు మూడు నెలల క్రితమే పరిశ్రమల శాఖ అధికారి రంగం సిద్ధం చేశారు. ఈ పరిశ్రమపైనే ఫిర్యాదులు రావడంతో అన్ని శాఖలతో కలిసి పరిశీలనకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఆ అధికారి బదిలీ కావడంతో తనిఖీ చేయలేదు. ఫలితంగా ప్రమాదం సంభవించింది.!

పై అధికారులదే పాపం..!

సుస్మిత ఫర్నిచర్ సంస్థకు అనుమతి పాపం పై అధికారులదే అని తెలుస్తోంది. రెండున్నరేళ్ల క్రితం ఈ ఫ్యాక్టరీ తనిఖీ చేయడానికి కైకలూరు అగ్నిమాపక శాఖ అధికారి వెళ్లారు. ఆయన పరిశీలించి అగ్ని ప్రమాదాల నివారణకు స్ప్రింక్లింగ్ పైపులైన్లు వేయాలని, గోడౌన్‌లు విడివిడిగా ఉండాలని, గోడౌన్ల మధ్య కొంత ఖాళీ ఉండాలని సూచించారు. ఫ్యాక్టరీ నిర్వాహకులు రాష్ట్రస్థాయి అధికారుల నుంచి అనుమతి పొందినట్లు తెలుస్తోంది.

పరుపుల తయారీ పరిశ్రమ దగ్ధం



ఫ్యాక్టరీ నుంచి వెలువడిన మంట, పొగ

ఏలూరు క్రైం, జూలై 10(ఆంధ్రజ్యోతి):అగ్ని ప్రమాదంలో పరుపుల తయారీ కంపెనీ, గోడౌన్ పూర్తిగా దగ్ధమైంది. ఏలూరు సమీపంలోని కొత్తూరు రోడ్ వంగాయిగూడెం క్యాన్సర్ ఆసుపత్రి ఎదురుగా సుస్మిత ఫర్నిచర్ కుషనింగ్ సంస్థను శీలంశెట్టి రాజా, శీలంశెట్టి కిశోర్‌కుమార్, శీలంశెట్టి సంధ్య, కొండవీటి నీలిమ నిర్వహిస్తున్నారు. జ్యూట్‌మిల్లు గోడౌన్లు లీజుకు తీసుకుని పరుపుల తయారీ, స్పాంజ్, ఫోమ్, ఇతర షీట్లు తయారీ కొనసాగిస్తున్నారు. ఫ్యాక్టరీ నుంచి కార్మికులు వెళ్లిపోయిన తర్వాత బుధవారం రాత్రి ఇద్దరు వాచ్‌మెన్‌లు ఉన్నారు. స్పాంజ్, ఫోమ్ తయారీకి ఉపయో గించే రసాయనాలు కూలింగ్‌లో ఉంచాలి. ఈ రెండు ట్యాంకుల వద్ద పెద్ద ఏసీని గురువారం ఉదయం 6 గంటలకు వాచ్‌మెన్ ఆన్‌చేశాడు. తర్వాత మెయిన్ గేటు వద్ద టిఫిన్ చేస్తుండగా 6.30 గంటల సమయం లో లోపల నుంచి పొగలు రావడం గమనించారు. క్షణాల్లోనే స్పాంజ్, ఫోమ్ ఇతర కెమికల్స్ మండడంతో భారీ ఎత్తున పొగలు వ్యాపించాయి. మంటలు ఎగిసి పడడంతో చుట్టుపక్కల వారు భయభ్రాంతులయ్యారు. ఎదురుగా క్యాన్సర్ ఆసుపత్రిలో రోగుల రక్షణకు ఆసుపత్రి సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. సమాచారం అందుకున్న జిల్లా అదనపు అగ్నిమాపక శాఖ అధికారి వి.రామకృష్ణ 2 ఫైర్ ఇంజన్లతో చేరుకున్నారు. మరోవైపు భీమడోలు, హనుమాన్ జంక్షన్, కైకలూరు ఫైర్ ఇంజన్లు కూడా రప్పించారు. 3 గంటల పాటు 5 ఫైర్ ఇంజన్లు మంటలను ఆర్పుతూనే ఉన్నాయి. అప్పటికే గోడౌన్‌లో కెమికల్స్, ఫోమ్, పరుపులకు సంబంధించిన మెటీరియల్ మొత్తం దగ్ధమైంది. కోట్లాది రూపాయల్లో నష్టం వాటిల్లింది. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, సిబ్బంది అక్కడకు చేరుకుని చుట్టు పక్కల ప్రజలను అప్రమత్తం చేశారు. మరోవైపు ఏలూరు - పెదపాడు మార్గంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరా యం లేకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఏసీ ఆన్‌చేయడంతో రసాయనాలు మండి ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. గోడౌన్ పక్కనే ఉన్న ఫంక్షన్ హాల్ ఏసీలు దగ్ధమయ్యాయి.

అనుమతి ఎలా ఇచ్చారు..?

జనావాసాల మధ్య, ఆసుపత్రి సమీపంలో రసాయనాలతో కూడిన పరుపుల తయారీ ఫ్యాక్టరీకి అనుమ తులు ఎలా ఇచ్చారని పరిశ్రమల శాఖ అధికారులను డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఫోన్‌లో ప్రశ్నించారు. తక్షణమే కమిటీ ఏర్పాటు చేసి ఎక్కడెక్కడ ఇలాంటి పరిశ్రమలు ఉన్నాయో తనిఖీ చేసి అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కంపెనీ ఉత్పత్తులకు లైసెన్సు, నిల్వ సామర్థ్యం, తయారీ అనుమతులపై డీఎస్పీ ఆరా తీశారు.



అనుమతులు పరిశీలిస్తాం

రెండు రోజుల్లో ప్రత్యేక చర్యలు

జిల్లాలో ప్రమాదకర వస్తువులు, కెమికల్స్ తయారీ పరిశ్రమలకు అనుమతుల పరిశీలనకు రెండు రోజుల్లో ప్రత్యేక చర్యలు చేపడతాం. జిల్లాలో మూడు నెలల్లో భారీ అగ్ని ప్రమాదాలు జరిగాయి. అన్ని ప్రమాదాలను అధ్యయనం చేసిన జనవాసాల మధ్య, ఆసుపత్రి వద్ద అనుమతులను పరిశీలిస్తాం. ప్రమాదకరమైన ఫ్యాక్టరీలపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం.

వి.రామకృష్ణ,
జిల్లా అదనపు అగ్నిమాపకశాఖ అధికారి

గురుకుల కళాశాల విద్యార్థిని మృతి

- మృతిపై అనుమానాలు • బంధువుల ఆందోళన • ఆర్డీవో విచారణ



ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టిన విద్యార్థిని బంధువులతో మాట్లాడుతున్న ఆర్డీవో అంబరీష్ (ఇన్‌సెట్) విద్యార్థిని మృతదేహం

భీమడోలు, జూలై 10(ఆంధ్రజ్యోతి):పోలసానపల్లి బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందింది. కళాశాలలో గురువారం మధ్యాహ్నం 3.30 గంటల వరకూ మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ అనంతరం సాయంత్రం ఈ సంఘటన చోటు చేసుకుంది. భీమడోలు శివారు అర్జావారిగూడెం గ్రామానికి చెందిన లేళ్ల మానస (16) అప్పటి వరకు తల్లిదండ్రులు మరియమ్మ రాజుతో ఉల్లాసంగా సమావేశంలో ఉందని చెబుతున్నారు. తర్వాత కొద్దిసేపటికే మృతి చెందినట్లు తెలియడంతో తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. చున్నీతో ఉరివేసుకుని మృతి చెందినట్లుగా కళాశాల అధికారులు చెబుతుండగా తల్లిదండ్రులు, బంధువులు ఖండిస్తున్నారు. పాఠశాల అధికారులు, అధ్యాపకులు ఏదో చేశారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మానస అపస్మారక స్థితిలో ఉండడంతో కళాశాల యాజమాన్యం మానసను భీమడోలు ప్రభుత్వ సామాజిక వైద్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన

గురుకుల కళాశాల విద్యార్థిని మానస మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమతో ఉల్లాసంగా గడిపిన కుమార్తె అంతలోనే ఎలా చనిపోతుందని తల్లిదండ్రులు, బంధువులు ప్రశ్నిస్తున్నారు. మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ తమకు న్యాయం చేయాలంటూ ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టి నినాదాలు చేశారు.

పోలసానపల్లి గురుకుల కళాశాలలో విద్యార్థిని మృతి సంఘటన సమాచారం తెలుసుకున్న ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐ విల్సన్, తహసీల్దార్ రమాదేవి కళాశాలను సందర్శించారు. తొలుత ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టిన బంధువులతో మాట్లాడారు. అనంతరం గురుకుల కళాశాలలో విచారణ నిర్వహించారు. బాలిక మృతిపై పూర్తి స్థాయి విచారణ చేస్తామని డీఎస్పీ శ్రావణ్‌కుమార్ తెలిపారు.



సంఘటనా స్థలిలో ఆవుల కళేబరాలు

జాతీయ రహదారిపై వ్యాన్ బోల్తా

14 ఆవులు మృత్యువాత

దెందులూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి):మండలంలోని సోమవరప్పాడు పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారిపై వ్యాన్ బోల్తా పడి 14 ఆవులు మృత్యువాత పడ్డాయి. విశాఖపట్నం నుంచి గుంటూరు పశువుల సంతకు తరలిస్తుండగా వ్యాన్ బోల్తా పడడంతో వ్యాన్‌లో ఉన్న 30 ఆవులలో 14 ఆవులు మృతి చెందాయి. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, దెందులూరు నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి వెంకట చైతన్యకృష్ణ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సంఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన పశువులను పరిశీలించారు. అనుమతి లేకుండా పశువులను సంతకు తరలించే వారిపై కేసులు నమోదు చేయాలని, పోలీసులు నిత్యం తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. సీఐ రాజశేఖర్, ఎస్ఐ శివాజీ బీజేపీ నాయకులతో చర్చలు జరిపి అనుమతి లేకుండా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాన్ బోల్తా సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. చీకటి ప్రభుచౌదరి, శేఖర్, నాయకులు పాల్గొన్నారు

పథకం ప్రకారం మహిళను నరికి చంపాడు

కైకలూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి):పథకం ప్రకారం మహిళను కత్తితో నరికి చంపిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 8న పోతుమర్రు శివారు గొల్లగూడెంలో జరిగిన నంగెడ్డ వరలక్ష్మీదేవి హత్య కేసు వివరాలను గురువారం డీఎస్పీ తెలిపారు. వరలక్ష్మీదేవి ఇంటి ఎదురుగా ఉంటున్న కట్టా రామాంజనేయులు భార్య కృష్ణవేణి స్నేహంగా ఉండేవారు. బంటా మేస్త్రీ బండారి నాగమల్లేశ్వరరావుతో ఇంటి ఎదురుగా ఉన్న కృష్ణవేణిని వరలక్ష్మీదేవి ఫోన్‌లో మాట్లాడిస్తుంది. భార్య కృష్ణవేణి ప్రవర్తనపై అనుమానం కలిగిన రామాంజనేయులు నిలదీయడంతో వరలక్ష్మీదేవి ద్వారా బంటా మేస్త్రీతో మాట్లాడినట్లు చెప్పింది. ఈ నెల 7న వరలక్ష్మీదేవి, నాగమల్లేశ్వరరావును చంపాలని రామాంజనేయులు పథకం వేశాడు. ఈ నెల 8న మధ్యాహ్నం సమయంలో ఇంట్లో భోజనం చేస్తున్న వరలక్ష్మీదేవిని కల్లు గీత కత్తితో నరికి హత్య చేశాడు. అక్కడి నుంచి నాగమల్లేశ్వరరావును చంపేందుకు వెళ్లి అతడు కనిపించకపోవడంతో పారిపోయాడు. గురువారం మధ్యాహ్నం ఉప్పుటేరు వద్ద రామాంజనేయులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. అతడి వద్ద హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపు మరకలైన దుస్తులను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లుగా తెలిపారు. పూర్తి విచారణతో సాక్ష్యాధారాలను కోర్టుకు అందించి శిక్ష పడేలా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ వి.రవికుమార్, కలిదిండి ఎస్సై వెంకటేశ్వరరావు, ముదినేపల్లి, కైకలూరు రూరల్ ఎస్సైలు వీరభద్రరావు, వి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భార్య ప్రవర్తన భరించలేక భర్త ఆత్మహత్య

ఏలూరు క్రైం, జూలై 10(ఆంధ్రజ్యోతి):భార్య ప్రవర్తనతో విసుగుచెందిన భర్త ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు తూర్పువీధికి చెందిన తేరా రఘు (26) హైదరాబాద్‌కు చెందిన మౌనికను 2017లో వివాహం చేసుకున్నాడు. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మే నెలలో కూలి పనులకు హైదరాబాద్‌కు వెళ్లాడు. 10 రోజుల క్రితం మౌనిక ఇద్దరు పిల్లలను ఏలూరు తీసుకువచ్చి రఘు తల్లికి అప్పగించి స్కూల్‌లో చేర్పించాలని చెప్పి హైదరాబాద్ వెళ్లిపోయింది. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని వారు ఉండే గదిలో రఘుని బయట తాళం వేసి మౌనిక వెళ్లిపోయింది. చివరికి ఏలూరులో తన సోదరుడు రాజుకు ఫోన్‌చేసి తన వద్ద ఒక్క రూపాయి కూడా లేదని, తన భార్య అన్నీ పట్టుకుని వెళ్లిపోయిందని చెప్పాడు. రాజు రూ.వెయ్యి ఫోన్‌పే చేయడంతో ఏలూరు వచ్చాడు. వారి ఇంటి పై భాగంలో రఘు వెళ్లి పడుకున్నాడు. తెల్లవారేటప్పటికి అక్కడే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా గుర్తించిన నిందితుల వివరాలు

పోలీసుల ఏఐ నిఘా

ఏలూరు క్రైం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ నిఘా కెమెరాలను ఏర్పాటుతో 70 శాతం నేరాల నియంత్రణ అదుపు చేయగలిగామని ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలను అదుపు చేయడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారాల నిఘా వ్యవస్థ సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతున్నాయని ఎస్పీ తెలిపారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం సబ్ డివిజన్ల పరిధిలో పాత నేరస్తుల కదలికలపై పర్యవేక్షణ కొనసాగిస్తూ స్థానిక పోలీసు అధికారులకు తక్షణమే సమాచారం అందిస్తూ నిఘా ఉంచామన్నారు. జిల్లాలో 166 పాత నేరస్తులపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచడంతో వారి కదలికలు అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తిస్తున్నామన్నారు. ప్రజలు కూడా తమ ఇళ్లు, షాపుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. దీని వల్ల నేరానికి పాల్పడిన వారిని గుర్తించడంతో పాటు అదుపులోకి తీసుకోడానికి సీసీ ఫుటేజ్ ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్‌లో ప్రత్యేక కేసులలో సీసీ టీవీ ఫుటేజ్‌ల ప్రాముఖ్యత పెరుగుతుందని ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు.

దాడి చేసి సెల్ లాక్కుపోయారు

భీమవరం క్రైం, జూలై 10(ఆంధ్రజ్యోతి): వాకింగ్‌కు వెళ్లిన వ్యక్తిపై ఇద్దరు దాడి చేసి సెల్‌ఫోన్ లాక్కుపోయారు. వన్‌టౌన్ సీఐ ఎన్. నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం నల్లంవారి తోటకు చెందిన సుంకర ఏసుదాసు గురువారం ఉదయం వీరమ్మ పార్కులో వాకింగ్‌కు వెళ్లారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు అడ్రస్ అడిగారు. అడ్రస్ చెప్పే సమయంలో ఏసుదాసు జేబులో సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయేందుకు ప్రయత్నించారు. అడ్డుకోవడంతో వారి వద్ద ఉన్న రెండు బ్లేడులను తీసి దాడి చేశారు. కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకుని వారిద్దరిని పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. వారు ఇరగవరం మండలం రేలంగి గ్రామానికి చెందిన పులిగోరి నాని, అనకాపల్లికి చెందిన షేక్ ఆలీషాగా గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగరాజు తెలిపారు.

'నాపై తప్పుడు ప్రచారం తగదు'

నరసాపురం టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): బీజీబీఎస్ మహిళా కళాశాల అభివృద్ధికి నిస్వార్థంగా పని చేస్తున్నప్పటికీ కిరాయి వ్యక్తులతో తనపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని ఆ కళాశాల కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ అవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. తాను జీతాలు ఇవ్వడం లేదని, మహిళల్ని వేధింపులకు గురి చేస్తున్నానని ఆరోపించడం సరికాదన్నారు. దీనిపై ఆర్డీవో తొమ్మిది నెలల క్రితం విచారణ చేశారన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల రాజీకీ ప్రత్యేక డ్రైవ్

తణుకు, జూలై 10(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా కేసులు రాజీ చేయాలని నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి. సత్యవతి అన్నారు. గురువారం కోర్టు ప్రాంగణంలో మధ్యవర్తిత్వంపై కేసులు రాజీ గురించి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యవర్తిత్వం మీద కోర్టులు పనిచేసే ప్రతి చోట తొంబై రోజులు ప్రత్యేక డ్రైవ్ ద్వారా కేసులు రాజీ చేయడం జరుగుతుందన్నారు. కేసులు రాజీ గురించి ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. సమావేశంలో న్యాయమూర్తులు కె.కృష్ణ సత్యలత, సాయిరాం పోతర్లంక పాల్గొన్నారు.



సోమేశ్వరస్వామి, పార్వతి అమ్మవారికి శాకాంబరి అలంకరణ

శాకాంబరిగా సోమేశ్వరస్వామి దర్శనం

భీమవరం టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ పౌర్ణమి సందర్భంగా గునుపూడిలోని సోమేశ్వరస్వామి శ్వేత వర్ణంతోపాటుగా, శాకాంబరుడుగా భక్తుకు దర్శనం కల్పించారు. స్వామివారికి వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలులతో అలంకరించారు. పార్వతి అమ్మవారిని కూడా శాకాంబరీ దేవిగా అలంకారం చేశారు.



పోలేరమ్మకు ఆషాఢ సారె

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి):మాధవరంలో గ్రామ దేవత పోలేరమ్మకు గురువారం ఆషాఢ సారే అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి గ్రామస్థులంతా స్వీట్లు, పిండి వంటలతో ఊరేగింపు చేశారు. అనంతరం అమ్మవారికి సారే సమర్పించారు.

కనకదుర్గమ్మకు 108 కేజీల స్వీట్లతో సారె



భీమవరం టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపురం రోడ్డులో జగన్మాత కనకదుర్గమ్మకు ఆషాఢ సారె అందించారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. 108 కేజీల స్వీట్స్, పండ్లు, పూలతో అమ్మవారికి సారె అందించారు. ముందుగా మహిళా భక్తులు సారెతో ఊరేగింపు నిర్వహించారు.

పెంట్లమ్మకు ప్రత్యేక పూజలు



పెంటపాడు, జూలై 10(ఆంధ్రజ్యోతి): కే.పెంటపాడులో పెంట్లమ్మ అమ్మవారి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. కుంచనపల్లి గ్రామానికి చెందిన కోణాల మురళిమోహన్, దండుబోయిన వీరన్న(చిన్న) అమ్మవారి అన్నదాన కార్యక్రమానికిగాను రూ.51,116 అందజేశారు. అనంతరం భారీ అన్న సమారాధన జరిపారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గంధం సతీశ్, ఆలయ కమిటి చైర్మన్ పంతం శేఖర్, మల్లెల ప్రసాద్, నరాలశెట్టి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

భీమవరం టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా కెఎజె ప్రసూన అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్లాస్టిక్ నిషేధించాలి - మొక్కలు నాటాలంటూ ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డా కే శ్రీనివాసరావు, యూజీసీ కో ఆర్డినేటర్ డా అరవింద స్వామి, లైబ్రేరియన్ డా నరసింహ మూర్తి విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా గురువులకు సత్కారం

భీమవరం టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి భవనంలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ యోగా కేంద్రాల గురువులు రామాయణం రమేష్ బాబు, జెట్టి రామకృష్ణ, గొర్లి సీతారామయ్య, గండ్రెడ్డి కృష్ణ, తటవర్తి ఫణీంద్ర, పాపోలు ఏడుకొండలు తదితర యోగా గురువులను సత్కరించారు.

ఆకివీడు: పతంజలి యోగా కేంద్రంలో యోగాసనాచార్య కందుల సత్యనారాయణ దంపతులను శిష్య బృందం సన్మానించారు. కార్యక్రమంలో కేంద్ర సెక్రటరీ కుంకట్ల సత్యనారాయణ, ధ్యానరత్న ఉండ్రమట్ల సాంబశివరావు,శిష్యులు మోటుపల్లి గంగాధరరావు, జంపన రాము, ఎం.శ్రీహరిరాజు, గొంట్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

చండీ హోమం

పాలకొల్లు అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. చండీ హోమం నిర్వహించారు. పార్వతీ దేవి, లక్ష్మీ అమ్మవార్లకు కుంకుమ పూజలు చేసి అలంకరించారు.

మాచేనమ్మ హుండీ ఆదాయం రూ.6,17,738

ఆచంట, జూలై 10(ఆంధ్రజ్యోతి):పెదమల్లం మాచేనమ్మ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించగా రూ. 6,17,738 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ తెలిపారు. 85 రోజులకు గాను ఈ ఆదాయం రాగా దేవదాయ ధర్మాదాయ ఇన్‌స్పెక్టర్ వర్థినీడి సత్యనారాయణ సమక్షంలో ఆదాయం లెక్కించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకోడేరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.వెంకటేశ్వరరావు (ఈఈ) తెలిపారు. గొల్లలకోడేరు, తుమ్మగుంటపాలెం, గుబ్బలవారిపాలెం, పాలకోడేరు, గరగపర్రు, ఉప్పరగూడెం, చేరేగూడెం, యండగండి, పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: నీలాద్రిపురం, కొమ్ముగూడెం, పుల్లాయగూడెం, కృష్ణాపురం, వీరంపాలెం, బంగారుగూడెం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతంరాయం ఏర్పడుతుందని డీఈ కె.నరసింహమూర్తి తెలిపారు. వాణీ కాన్వెంట్ దగ్గర, పాతొలువారి వీధి, గ్యాస్ పంపురోడ్డు, కోటిబొమ్మ సెంటర్, ఎఫ్‌సీఐ కాలనీ, విజేత రోడ్డు ఏరియాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు వివరించారు. పీఅండ్‌టి కాలనీ, జడ్పీహెచ్ ఫీడర్‌లకు సంబంధించి మెయిన్‌రోడ్డు, మసీదురోడ్డు, డీఎస్ చెరువు, వివేకానంద బొమ్మరోడ్డు, పీఅండ్‌టి కాలనీ, ఇందిరా నగర్, ఏరియాలకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం పట్టణంలోని మార్కెట్ ఫీడర్ మరమ్మతుల్లో భాగంగా తాళ్లముదునూరుపాడు, భాగ్యలక్ష్మీపేట ప్రాంతాల్లో ఉదయం 9గంట నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ కే నరిసింహమూర్తి తెలిపారు.

పాలకొల్లు టౌన్: పట్టణంలోని ఈదిగువ పేర్కొన్న ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 12గంటల వరకు చెట్ల కొమ్మలు తొలగిస్తున్న దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ కె మధుకుమార్ తెలిపారు. బస్టాండ్ ప్రాంతం, మారుతీ థియేటర్, బ్యాంక్ కాలనీ, శ్రీరామ్‌పేట, మావుళ్ళమ్మ పేట, శాంతి నగర్, వడలి వానిపేట, కెనాల్ రోడ్డు ఏరియాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.



కలవపూడిలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు.. అలంపురం టీబీఆర్ స్కూల్ యాజమాన్యంతో ఎమ్మెల్యే బొలిశెట్టి, వలవల బాబ్జి.. వేల్పూరులో ఎమ్మెల్యే ఆరిమిల్లితో ఫొటోలు దిగుతున్న విద్యార్థులు

విద్యతోనే సమాజంలో గౌరవం

వేడుకగా టీచర్స్, పేరెంట్స్ సమావేశాలు

మొగల్తూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): సమాజంలో గౌరవం పెరగాలంటే చదువుతోనే సాధ్యమని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. గురువారం ముత్యాలపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ మీట్‌లో తల్లిదండ్రులనుద్దేశించి వారు మాట్లాడారు. చదువు లేకుంటే ఎంత డబ్బున్నా సమాజంలో గౌరవం ఉండదని గౌరవాన్ని కాపాడుకోవాలంటే విద్యావంతులుగా ఎదగడం ఒక్కటే మార్గమని వారు వివరించారు. అనంతరం అధికారులు, నాయకుల సమక్షంలో విద్యార్థులు వారి తల్లితండ్రులకు పాదపూజ చేశారు.

నరసాపురం రూరల్ : మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశం ఉత్సాహంగా సాగింది. విద్యార్థులు స్కూల్ ప్రాంగణంలో ముత్యాల ముగ్గులు వేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇటు విద్యార్థుల తల్లిదండ్రులు ఈ వేడుకలో పాల్గొన్నారు. వైఎస్‌పాలెంలోని జడ్పీస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆర్డీవో దాసిరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. పదిలో నియోజకవర్గ ఫస్ట్ వచ్చిన టి.దీప్తికి కొలపర్తి సుజాత జ్ఞాపకార్థం రూ.10వేలు సర్పంచ్ వైఎస్ నాగ ముత్యామాంబ, బాబులు, కొలపర్తి శ్రీనివాసరావు చేతుల మీదుగా అందించారు. స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. పట్టణంలోని స్టీమర్‌రోడ్ ప్రైమరీ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి డీఎస్పీ శ్రీవేద ముఖ్య అతిథిగా విచ్చేశారు. మండలంలోని ఎల్‌బిచర్ల, రుస్తుంబాదా గ్రామాల్లోని స్కూల్‌లో విప్ నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు పాల్గొని మాట్లాడారు.

కాళ్ళ: కూటమి ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు అన్నారు. కలవపూడి హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన 'మెగా పేరెంట్స్ డే' సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సమకూర్చిన వసతులతో విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు మొక్కలు ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు.

పెంటపాడు: అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్, విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశాలల్లో ఎమ్మెల్యే బొలిశెట్టి పాల్గొన్నారు. తొలుత టీబీఆర్ పాఠశాలలో సంస్థ చైర్మన్ తనుబుద్ది భోగేశ్వరరావు ఎమ్మెల్యే బొలిశెట్టితో పాటు భవన కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీలను శాలువాతో సత్కరించారు. విజ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్, డైరెక్టర్లు గుణ్ణం లక్ష్మీనారాయణ, గుణ్ణ ం చిరంజీవి, కిలపర్తి వెంకట్రావు, బండారు వెంకట్రా వు, పాలూరి వెంకటేశ్వరరావు, టీబీఆర్ సీఈవో రవికిరణ్, కరస్పాండెంట్ పద్మావతి, పారిచర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

ఆచంట: ఆచంట ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పితాని తనయుడు వెంకట్, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవితోపాటు ఆయా పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉండి:ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే విద్యాభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ తెలుగు యువత మాజీ అధ్యక్షుడు, లయన్స్ క్లబ్ సభ్యుడు చెన్నంశెట్టి హరినాయుడు అన్నారు. గురువారం ఉండిలోని దివ్యకళాశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత హరినాయుడును ఘనంగా సన్మానంచారు.

తణుకు రూరల్: రాష్ట్రంలో విద్యా వ్యవస్థను కార్పొరేట్ వ్యవస్థకు దీటుగా ప్రభుత్వ విద్యారంగాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొస్తుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. గురువారం వేల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వి. కృష్ణవేణి, తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ, ఏఎంసీ మాజీ వైస్ ఎంపీపీ వల్లూరి రామ్మోహన్, మాజీ ఉప సర్పంచ్ రెడ్డి నరేంద్ర ప్రసాద్, మండల జన సేన పార్టీ అధ్యక్షుడు చిక్కాల వేణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ విద్యార్థులతో ఫొటోలు దిగారు.

తణుకు: మంత్రి నారా లోకేశ్ సారధ్యంలో విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చినట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం చిట్టూరి ఇంద్రయ్య జూనియర్ కాలేజిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో విద్యావ్యవస్థను భ్రస్టు పట్టించారని ఆరోపించారు.

ఇరగవరం: పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఇరగవరం మండల స్పెషల్ ఆఫీసర్ నాగరాజు అన్నారు. ఇరగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ సమావేశం గురువారం నిర్వహించారు. పదవ తరగతిలో ప్రథమ స్థానం పొందిన ఇద్దరు విద్యార్థులకు 20 వేల రూపాయల చెక్కును దాత కృష్ణంరాజు, వర్మసాయంతో విద్యార్థులకు అందించారు.

తాడేపల్లిగూడెం రూరల్: కొమ్ముగూడెంలో నిర్వహించిన సమావేశంలో ఎంఈవో వి హనుమ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తాడేపల్లి బేబి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు జ్ఞాపికలు అందించారు. చినతాడేపల్లిలో టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందించారు. మాదవరంలో ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. రామన్నగూడెంలో జడ్పీఉన్నత పాఠశాలలో తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ విద్యార్థులకు బహుమతులు అందించారు. మాధవరం జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థులు తల్లుల కాళ్లకు మొక్కి ఆశీర్వచనాలు తీసుకున్నారు.

భీమవరం రూరల్: పిల్లల భవిష్యత్ కోసం బడి వైపు ఒక్క అడుగు వేసి తల్లిదండ్రులు ఆలోచించాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. చిన అమిరంలోని జడ్పీ హైస్కూల్, పట్టణంలోని ఏఆర్‌కెఆర్ మునిసిపల్ హైస్కూల్, శశి మెరిట్ స్కూల్, సీఎస్ఎన్ స్కూల్‌లో గురువారం తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అంజిబాబు పాల్గొన్నారు.

పెనుగొండ:పెనుగొండలోని భాష్యం పాఠశాలలో మెగా పేరెంట్స్ కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ వెంకట అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె. గంగాధరరావు, వ్యవసాయాధికారిణి స్పందన, ఎంఈవో సుభాకర్‌రావు, హెచ్ఎం వి రాణీ రోజాజి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెనుమంట్ర: పొలమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనానికి సర్పంచ్ కాకర రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రకళా ఉపాధ్యాయుడు క్రాఫ్ట్ ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన ఫొటోస్టాల్‌ను ఆసక్తిగా తిలకించారు. మండల ప్రత్యేకాధికారి హరి సూర్య ప్రకాశ్, ఏఎంవో సర్వ శిక్షఅభియాన్ సుబ్రహ్మణ్యం, ఎంఈవో ఉంగరాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకివీడు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు ఉన్నప్పటికీ ప్రైవేటు పాఠశాలలవైపు మొగ్గుచూపడం కరెక్టుకాదని డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ వెంకట కృష్ణ అన్నారు. పెదకాపవరం జడ్పీపాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ సమావేశలో ఆయన పాల్గొన్నారు. తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటూ చదువుకుని ఉన్నతస్థాయికి తాము చేరుకున్న సంగతి గుర్తు చేసుకున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఎలా చదువుకుంటున్నారు, వారి నడవడిక ఎలా ఉందని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన అన్నారు.



ఉండిలో టీడీపీ నాయకుడు హరినాయుడును సన్మానిస్తున్న దృశ్యం

తల్లిదండ్రుల సమావేశాన్ని పరిశీలించిన కలెక్టర్

భీమవరం రూరల్: భీమవరం మండలంలోని పీఎస్ఎం మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాల, చిన అమిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను గురువారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సందర్శించి తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహణను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల హాజరు నమోదును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో పాఠాలు బాగా చెబుతున్నారా. భోజనం బాగుంటుందా, ఉపాధ్యాయులు ఏ విధంగా విద్యాబోధన చేస్తున్నారు అని విద్యార్థులను ఆరా తీశారు.

బాబా ఆలయాల్లో గురుపౌర్ణమి పూజలు



సాయిబాబాను దర్శించుకున్న ఎమ్మెల్యే అంజిబాబు

పెంటపాడు, జూలై 10(ఆంధ్రజ్యోతి): పెంటపాడులోని ఆలయ కమిటి అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో వరసిద్ది సాయిబాబా మందిరంలోనూ, వెలమ యువజనసంఘం ఆధ్వర్యంలో గౌరీదేవి ఆలయంలోనూ, ఆలయ కమిటి అధ్యక్షుడు బేతిన గిరిధర్ ఆధ్వర్యంలో రాచర్ల సాయిబాబా ఆలయంలోనూ గురు పౌర్ణమి వేడుకలు జరిపారు. అనంతరం భారీ అన్న సమారాధనలు జరిపారు. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మూడు ఆలయాలను దర్శించుకున్నారు. పెంటపాడు వరసిద్ది సాయిబాబా ఆలయంలో దాతలు సమకూర్చిన 3 కేజీల వెండి గొడుగును ఎమ్మెల్యే బొలిశెట్టి బాబాకు అలంకరించారు.

భీమవరం టౌన్:మానసిక ఒత్తిడిని దూరం చేసి ప్రశాంతతనిచ్చేది ఆధ్యాత్మిక చింతన అని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. గురుపౌర్ణమి వేడుకలను షిరిడి సాయిబాబా రథ మందిరంలో ప్రారంభించారు. ముందుగా బాబావారికి పంచామృతాలతో అభిషేకాలు, లక్ష్మి గణపతి హోమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు ఉండపల్లి రమేష్ నాయుడు, అధ్యక్షుడు చల్లా రాము మాట్లాడుతూ ఈ నెల 17న అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు.

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని శ్రీఅన్నపూర్ణా సమేత శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో లక్షపత్రి పూజలు నిర్వహించారు. పట్టణంలోని పెద్ద సాయి బాబా ఆలయంలో స్వామివారికి హారతులు ఇచ్చి, పూజలు నిర్వహించారు. సుమారు 12వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు

మొగల్తూరు: మొగల్తూరు రామాలయం వీధిలోని బాబా ఆలయం, రామన్నపాలెం, పేరుపాలెం, కెపి పాలెం, కొత్తోట గ్రామాల్లోని బాబా ఆలయాల్లోని బాబాను భక్తులు దర్శించుకోవడంతో పాటు సామూహిక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో వేలాదిమంది పాల్గొని బాబా ప్రసాదం స్వీకరించారు.

గణపవరం: గణపవరం మండలంలోని షిరిడి సాయిబాబా ఆలయానికి భక్తులు పోటెత్తారు. బాబా వారికి పాలాభిషేకం నిర్వహించి అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. కాగా పిప్పరలోని షిరిడిసాయిబాబా ఆలయం వద్ద అఖండ అన్న సమారాన నిర్వహించారు.

ప్రజలు సహకరిస్తేనే అభివృద్ధి సాధ్యం

తాడేపల్లిగూడెం, జూలై 10 (ఆంధ్రజ్యోతి):ప్రజల సహకారంతో రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతోందని ప్రభుత్వం విప్ బొలిశెట్టి శ్రీనివాస్ స్పష్టం చేశారు. తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో గురువారం పీ4 కార్యక్రమంలో భాగంగా రాజకీయ నాయకులు, వాణిజ్యవేత్తలు, వివిధ ప్రజాసంఘాలతో ఆయన సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన పీ4లో భాగంగా బంగారు కుంటుంబ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవాలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమబోర్డు చైర్మన్ వలవల బాబ్జి, తాడేపల్లిగూడెం నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కూటమితోనే సాధ్యం

నరసాపురం రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో రాష్ట్రం పూర్తిగా భ్రష్టుపట్టిపోయింది, అలాంటి రాష్ట్రాన్ని చక్కదిద్ది అభివృద్ధి చేసే దిశగా కూటమి పాలన సాగిస్తుందని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార సహకార సమాఖ్య రాష్ట్ర చైర్మన్ కొల్లు పెద్దిరాజు అన్నారు. గురువారం మండలంలోని సారవ, తూర్పుతాళ్ళు గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు తీరును అడిగి తెలుసుకున్నారు.

అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా

మొగల్తూరు. జూలై10(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి అర్హుల జాబితా విడుదల కావడం జరిగిందని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ తెలిపారు. అర్హులైన రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో లేకపోతే సంబందిత రైతు సేవా కేంద్రంలో పట్టాదార్‌పాస్ పుస్తకం, ఆధార్ కార్డులను తీసుకువచ్చి తనిఖీ చేసుకోవాలన్నారు. అయినా అర్హులైన రైతులకు ఆధార్ లింక్ కానిపక్షంలో వీఆర్వోను కలిసి ఆధార్‌కార్డు, పాస్‌పుస్తకాలను మరోసారి నమోదు చేయించుకోవాలన్నారు. ఈపథకానికి సంబంధించి ఈనెల 13వ తేదీ లోగా నమోదు చేయించుకోవాలని సూచించారు.

ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడదాం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజలను మభ్యపెట్టే విధంగా పాలన చేస్తోందని వారి వైఫల్యాలు ఎండగట్టే విధంగా నాయకులంతా గ్రామస్థాయిలో పనిచేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు సూచించారు. తాడేపల్లిగూడెంలోని వైసీపీ కార్యాలయంలో మాజీ మంత్రి కొట్టుసత్యనారాయణ అధ్యక్షతన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు పార్టీ ఎజెండా వివరించారు.

ఉద్యోగిపై దౌర్జన్యం చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

భీమవరం టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆకివీడు నగర పంచాయతీ సీనియర్ అసిస్టెంట్. వెంకటేశ్వర రావుపై దౌర్జన్యం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మునిసిపల్ ఉద్యోగలు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. ఇటువంటి వారిపై బీఎన్ఎస్ చట్టం కింద వెంటనే నాన్ బెయిలబుల్ కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని కోరారు.

వేంకటేశ్వరస్వామికి గరుడోత్సవం

భీమవరం టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢ పౌర్ణమి సందర్భంగా జువ్వలపాలెం రోడ్డులో పద్మావతీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం రాత్రి స్వామివారికి గరుడ వాహనం సేవ కార్యక్రమం నిర్వహించారు ముందుగా ఆలయ అర్చకుడు వాడపల్లి ఆదినారాయణాచార్యులు ఆధ్వర్యంలో ప్రదోష కాల పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకారం చేసిన గరుడ వాహనంపై స్వామివార్ల ఉత్సవ మూర్తులను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

హామీలను నెరవేరుస్తున్నాం

భీమవరం టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసుకుంటూ వస్తున్నామని టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యురాలు, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. యాదవుల వారి వీధిలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు వెండ్ర శ్రీనివాస్ క్లస్టర్ కన్వీనర్ పొత్తూరి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఉండి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించుకుందామని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నా రాయణరాజు అన్నారు. ప్రజాప్రతి నిధులు, అధికారులు కలిసి సమస్యలు గుర్తించి తక్షణ మే అభివృద్ధి పరుచుకుందామన్నారు. గురువారం ఉండి మండలపరిషత్ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ప్రజాప్రతి నిధులకు అధికారులు అండగా నిలవాలన్నారు.

ఫెన్సింగ్ పోటీలకు విశ్వకవి విద్యార్థుల ఎంపిక

భీమవరం టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 1వ తేదీన థాయిలాండ్‌లో జరిగే ఇంటర్నేషనల్ ఫెన్సింగ్ టోర్నమెంట్ కు ఇద్దరు భీమవరం విశ్వకవి స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం ఎంపికైన విద్యార్థులను ఎమ్మెల్యే అంజిబాబు అభినందించి ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున ప్రోత్సాహ పారితోషికం అందించారు. స్కూల్ డైరెక్టర్ పొట్లూరి రఘుబాబు మాట్లాడుతూ బాలుర విభాగంలో ఎం హర్షిత్ శ్రీవర్మ (3వ తరగతి), బాలికల విభాగంలో కె అన్య బెన్ (4వ తరగతి)లు ఇప్పటికే అనేక పతకాలు సాధించినట్టు తెలిపారు. వీరు థాయ్‌లాండ్ పోటీలకు వెళుతున్నట్టు తెలిపారు.

ఉచిత కుట్టు శిక్షణ తరగతులు

పాలకొల్లు టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా విద్యార్థినీలకు 2 నెలలు కుట్టు శిక్షణ తరగతులు గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ పి శోభారాణి ప్రారంభించారు కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ పి బుద్దరాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి రవి శంకర్, పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షురాలు నాగలక్ష్మీ, డాక్టర్ మణిమాల పాల్గొన్నారు.

రైతుల అభ్యంతరాల పరిష్కారం

ఉండి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జాతీయరహదారి 165 నిర్మాణంలో భాగంగా పెదపుల్లేరు గ్రామం రైతులు లేవనెత్తిన అభ్యంతరాలపై జిల్లా జాయింట్ కలెక్టరు రాహుల్‌కుమార్‌రెడ్డి గురువారం పరిష్కరించారు. జాతీయ రహదారుల అధికారుల సమక్షంలో విచారణ చేపట్టి పరిష్కరించారు. భూసేకరణపై ఆగ్రామం నుంచి ఐదుగురు రైతుల అభ్యంతరాలపై విచారణ నిర్వహించారు. ప్రధానంగా మూడు అంశాలపై రైతులు అభ్యంతరాలను వ్యక్తపరిచారు. వీటిని ఎన్‌హెచ్ అధికారులు పరిష్కరించేందుకు ముందుకు వచ్చారు.